V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
12-09-2024

సంపుటి : 01 । సంచిక : 130 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

అమెరికాలో రాహుల్ వ్యాఖ్యలపై

# రాజకీయ దుమారం

## మండిపడుతున్న బీజేపీ నేతలు

- దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులకు అండగా నిలవడుతున్నారు
- అదో అలవాటుగా మారిందని అమిత్ షా విమర్శ
- సోనియా నివాసం బయిట నిరసనలు
- బీజేపీ నేత ఆర్పీసింగ్, మరికొందరు అరెస్టు
- రాహుల్ గాంధీ స్వదేశానికి వచ్చాక.. 25వేల మంది నిరసనకు దిగుతామన్న ఆందోళనకారులు



2

# "మిస్టర్ రాహుల్ గాంధీ.. క్విట్ ఇండియా"

- విదేశాలకు వెళ్లి భారత ఎన్నికల వ్యవస్థను విమర్శిస్తావా?
- నీకు ఈదేశంలో ఉండే అర్హత లేదంటూ మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



3



కూల్చివేతలపై స్టే తెచ్చుకున్నా..

# కోర్టుల్లో కొట్లాడతాం

## ఆక్రమణలు వదిలి గౌరవంగా తప్పుకోండి

> "కొందరు పెద్దలు ప్రాజెక్టుల వద్ద ఫాంహౌస్ లు కడుతున్నారు. వాటి నుంచి నుంచి వచ్చే డ్రైనేజీని గండిపేటలో కలుపుతున్నారు. నాలాల ఆక్రమణలతో ఉప్పెనలా వరదలు వస్తున్నాయి. దీంతో పేదల ఇళ్లుమునుగుతున్నాయి. చెరువులను ఆక్రమణల నుంచి విడిపించేందుకే హైడ్రాను ఏర్పాటు చేశాం.ఆక్రమణలు వదిలి గౌరవంగా తప్పుకోండి. వాటిని కూల్చే బాధ్యత తీసుకుంటాం. కూల్చివేతలపై స్టే తెచ్చుకున్నా.. కోర్టుల్లో కొట్లాడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ పోలీసు అకాడమీలో నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.


- హైదరాబాద్ కాలుష్యం నల్గొండకు చేరుతోంది..
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తాం
- ప్రాజెక్టుల వద్ద ఫాంహౌస్‌లు కడుతున్నారు.. డ్రైనేజీని గండిపేటలో కలుపుతున్నారు
- నాలాల ఆక్రమణలతో ఉప్పెనలా వరదలు
- చెరువులను కబ్జాలనుండి విడిపించేందుకే హైడ్రా ఏర్పాటు చేశాం
- మూసీ వెంట ఉన్న 11 వేల మంది బాధితులకుడబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తా
- టీజీపీఎస్సీపై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవు..
- వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపించాం
- కులవృత్తులతో పాటు చేతి వృత్తులను బలోపేతం చేస్తున్నాం
- పోలీస్ అకాడమీలో పాసింగ్ అవుడ్ పరేడ్‌లో పాల్గొని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:**

ఆక్రమణలు వదిలి గౌరవంగా తప్పుకోవాలని , వాటిని కూల్చే బాధ్యత తీసుకుంటామని కూల్చివేతలపై స్టే తెచ్చుకున్నా.. కోర్టుల్లో కొట్లాడతామన్నారు సీఎం రేవంత్ రెడ్డి . హైదరాబాద్ కాలుష్యం నల్గొండకు చేరుతోందని ఆక్రమణలు తొలగించి మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తామని సీఎం స్పష్టం చేసారు . తెలంగాణ పోలీసు అకాడమీలో బుధవారం నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ... కొందరు పెద్దలు ప్రాజెక్టుల వద్ద ఫాంహౌస్‌లు కడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. . ''ఫాంహౌస్‌ల నుంచి నుంచి వచ్చే డ్రైనేజీని గండిపేటలో కలుపుతున్నారని తెలిపారు. నాలాల ఆక్రమణలతో ఉప్పెనలా వరదలు వస్తున్నాయని , దీంతో పేదల ఇళ్లు మునుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. చెరువులను ఆక్రమణల నుంచి విడిపించేందుకే హైడ్రాను ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడి పరివాహక ప్రాంతంలో పేదల ఆక్రమణలు మిగతా2లో...

## సీఎం రేవంత్ రెడ్డితో పవన్ కళ్యాణ్ భేటీ

- తెలంగాణ వరద బాధితులకు ఏపీ డిప్యూటీ సీఎం రూ.కోటి విరాళం



2

## దర్యాప్తు సంస్థలు నిజాలను నిగ్గు తేల్చాలి

- దోషులను కఠినంగా శిక్షించాలి
- కర్ణాటక వాల్మీకి స్కామ్ డబ్బులే.. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ వాడింది
- గిరిజనుల సంక్షేమానికి వాడాల్సిన సొమ్మును ప్రచారానికి వాడుకున్నారు
- రూ.187కోట్లు దారిమళ్లించారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు



2

## భూమి కోల్పోయిన వారిని మనం గౌరవించాలి

- మహోన్నత ఆశయం కోసం వారు భూమిని త్యాగం చేశారు
- అర్హులైన వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- 2025 మార్చి కల్లా యాదాద్రిలో 4000 మెగావాట్ల
- విద్యుత్ ఉత్పత్తి చేయడమే టార్గెట్: భట్టి విక్రమార్క
- దామరచర్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి



2

ఇప్పటివరకు 262 అక్రమ నిర్మాణాలు

# కూల్చివేశాం

## 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నాం

### ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన హైడ్రా

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** అన్యక్రాంతమైన ప్రభుత్వ భూములను, చెరువులను పరిరక్షించేందుకు రంగంలోకి దిగిన హైడ్రా.. ఆక్రమణదారుల నుంచి ఇప్పటి వరకు వంద ఎకరాలకుపైగా స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 23 ప్రాంతాల్లో మిగతా2లో...





## ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తుతా..!

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తా

జులానా స్థానానికి నామినేషన్ దాఖలు

మీడియాతో మాటాడిన వినేశ్ ఫొగట్

2

సమ్మక్క-సారక్క ప్రాజెక్ట్‌కు అనుమతుల

# ప్రక్రియ వేగవంతం చేయండి

## కేంద్ర జలసంఘం లేవనెత్తిన అంశాలను వేగవంతంగా నివృత్తి చేయాలి

- త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలి
- నష్టపరిహారంపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి
- ఎన్డీఎస్ఏ తుది నివేదికను త్వరితగతిన సమర్పించాలి
- లష్కర్‌ల నియామకాలను చేపట్టాలి
- నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 99 | రిటైల్ ₹ 121 |
| స్కిన్ ₹ 175 | స్కిన్ లెస్ ₹ 200 |

20 సీట్లు వచ్చిఉంటే..

# వాళ్లు జైల్లో మగ్గేవారు



2

- పదేండ్లలో మోదీ సర్కార్ చేసింది శూన్యం
- ఎక్కడైనా బ్రిడ్జిని ప్రారంభిస్తే అది కుప్పకూలుతోంది
- అయోధ్యలో రామమందిరం నుంచి నీరు కారుతోంది
- ఎన్డీయే ప్రభుత్వం అసమర్థ కూటమిగా మారింది
- అనంతనాగ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీజేపీపై కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున్ ఖర్గే వ్యాఖ్యలు

బుడమేరు గండ్లు పూడ్చటానికి

# ఒక యుద్ధమే చేశాం

- విజయవాడలో సాధారణ పరిస్థితులకు 10 రోజులు పట్టింది..
- ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలే ఎక్కువ నష్టపోతారు
- ప్రకాశం బ్యారేజీ వద్ద పడవలు వదిలింది వైసీపీకు చెందిన వారే..
- పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో ఎకరాకు రూ.10 వేలు పరిహారం
- నేరస్థులు రాజకీయ ముసుగు వేసుకున్నారు
- కొల్లేరు, ఉప్పుటేరు, తమ్మిలేరు వరదలపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష



**విశ్వంభర ఏలూరు:**

ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి జిల్లాల పర్యటనకు వెళ్లారు. ఏలూరు జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కొల్లేరు పరివాహక ప్రాంతాలను విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. రోడ్డు మార్గంలో తమ్మిలేరు వరద ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం కొల్లేరు, ఉప్పుటేరు, తమ్మిలేరు వరదలపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో ఎకరాకు మిగతా2లో...

సీఎం రేవంత్ రెడ్డితో పవన్ కళ్యాణ్ భేటీ

విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. హైదరాబాద్ వచ్చిన ఆయన.. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిశారు. తెలంగాణ భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన వారికి అండగా నిలుస్తూ పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కోటి రూపాయల విరాళాన్ని సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు డీసీఎం పవన్. ఇందుకు సంబంధించిన చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. పవన్ కల్యాణ్, రేవంత్ రెడ్డి వెంట పలువురు కాంగ్రెస్, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలంగాణలో మున్నేరు వాగు.. ఏపీలో బుడమేరు పొంగి పొర్లాయి. మహోగ్రరూపం దాల్చిన మున్నేరు ఖమ్మంను ముంచెత్తగా.. బుడమేరు విజయవాడను ముంచేసింది. ఈ వరదలకు పదుల సంఖ్యలో ప్రాణ నష్టం సంభవించగా.. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వేల కోట్లలో ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో వరద బాధితులకు అండగా తన వంతు ఆర్థిక సాయం ప్రకటించారు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. తన సొంత నిధుల నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెరి కోటి రూపాయలు విరాళం ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఏపీకి ప్రకటించిన రూ. కోటి విరాళానికి సంబంధించి చెక్కును అందజేశారు. అదే సమయంలో ముంపునకు గురైన గ్రామాలకు.. రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు పవన్. ఇక తెలంగాణకు సైతం కోటి విరాళం ప్రకటించిన పవన్.. బుధవారం నాడు ఆ విరాళానికి సంబంధించిన చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు.

## ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తుతా..!

**జులానా:** తాను క్రీడల్లో సత్తా చాటడం ఒక్కటే కాదని, తన ప్రాంత ప్రజలకు రోడ్లు, విద్యుత్, మంచినీరు సహా అన్ని సదుపాయాలూ సమకూర్చేందుకు పోరాడతానని జులానా అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ పేర్కొన్నారు. హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీలో తాను ప్రజాసమస్యలను ప్రస్తావిస్తూ వారి తరపున గొంతెత్తుతానని చెప్పారు. జింద్‌లో ఆమె బుధవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.జంతర్‌మంతర్ వద్ద తాము నిరసనలను ప్రారంభించే క్రమంలో అందుకు అవసరమైన అనుమతులను ఇద్దరు బీజేపీ నేతలే తమకు ఇప్పించారని చెప్పారు. తమ పోరాటం కొనసాగిస్తామని వినేశ్ ఫోగట్ స్పష్టం చేశారు. అంతకుముందు స్టార్ రెజ్లర్, కాంగ్రెస్ నాయకురాలు వినేశ్ ఫోగట్ నామినేషన్ దాఖలు చేశారు. జులానా అసెంబ్లీ స్థానానికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా, ఇతర నేతలు ఉన్నారు.

## 20 సీట్లు వచ్చిఉంటే.. వాళ్లు జైల్లో మగ్గేవారు

**అనంతనాగ్:** తమకు మరో 20 సీట్లు వచ్చి ఉంటే వారంతా జైల్లో ఉండేవారు.. అంటూ బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీపై విమర్శలు చేశారు. పదేండ్లలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేశారు. జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసిన ఖర్గే బుధవారం శ్రీనగర్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత పదేండ్లలో బీజేపీ చేసింది శూన్యమని, ఎక్కడైనా బ్రిడ్జిని ప్రారంభిస్తే అది కుప్పకూలుతోందని, అయోధ్యలో రామమందిరాన్ని ప్రారంభిస్తే ఆలయం నుంచి నీరు కారుతోందని వ్యాఖ్యానించారు.ప్రతిచోటా మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయని, పవిత్ర హస్తంతో ప్రారంభోత్సవం చేయాలని ప్రజలు అంటున్నారు, ఇప్పుడు అది పవిత్ర హస్తమో, మరే హస్తమో నాకు తెలియడం లేదని అన్నారు. ఇక అనంత్‌నాగ్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అంతకుముందు ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. ఇవాళ దేశంలో మైనారిటీ ప్రభుత్వం కొలువుతీరిందని, లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ 400కుపైగా స్థానాలు గెలుచుకుంటామని ప్రగల్బాలు పలికిందని గుర్తుచేశారు.మరి మీ 400 సీట్లు ఎక్కడున్నాయని ఎద్దేవా చేశారు. 400పైగా సీట్లు సాధిస్తామని డప్పు కొట్టుకున్న కాషాయ పార్టీకి అతికష్టం మీద 240 స్థానాలే దక్కాయని వ్యాఖ్యానించారు. తమకు మరో 20 సీట్లు వచ్చిఉంటే ఈ నేతలంతా జైల్లో మగ్గేవారని, వారికి అదే సరైన ప్రదేశమని ఖర్గే పేర్కొన్నారు. అందుకు వారు అర్హులని పరోక్షంగా కాషాయ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అయితే ఆయన ఎవరి పేర్లను ప్రస్తావించలేదు.మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అసమర్థ కూటమిగా మారిందని అన్నారు.



# అమెరికాలో రాహుల్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం

**ఢిల్లీ:**అమెరికా పర్యటనలో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనపై మండిపడ్డారు. దేశాన్ని విభజించేందుకు కుట్ర పన్నుతోన్న శక్తులకు అండగా నిలబడటం రాహుల్‌కు , కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

**దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులకు అండగా నిలవడం రాహుల్‌కు అలవాటుగా మారింది: అమిత్ షా..**

''దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడం, దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులకు అండగా నిలవడం రాహుల్, కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది. జమ్మూకశ్మీర్లో నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన దేశవ్యతిరేక, రిజర్వేషన్ల వ్యతిరేక అజెండాకు మద్దతు ఇవ్వడమైనా సరే, విదేశీ గడ్డపై భారత్ వ్యతిరేక ప్రకటనలైనా సరే.. ఆయన ప్రతిసారీ దేశ భద్రతను ముప్పులో పడేస్తున్నారు. మనోభావాలను దెబ్బతీస్తున్నారు. ప్రాంతీయవాదం, మతం, భాష పరంగా చీలికలు తెచ్చే కాంగ్రెస్ రాజకీయాలను రాహుల్ ప్రకటన బయట పెట్టింది. రిజర్వేషన్ల రద్దు గురించి మాట్లాడి.. వాటిపై కాంగ్రెస్ వ్యతిరేకతను మరోసారి మనముందుంచారు. ఆయన మనసులో మెదిలే ఆలోచనలే చివరకు మాటల రూపంలో బయటపడ్డాయి. ఇక్కడ నేను రాహుల్ కు ఒక విషయం స్పష్టంచేయాలని ఉన్నంతకాలం రిజర్వేషన్లను ఎవరూ రద్దు చేయలేరు. అలాగే దేశభద్రతతో ఆటలాడలేరు'' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.



**ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదు...**

అగ్రరాజ్య పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ పలు ప్రసంగాలు చేశారు. ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడుతూ.. '' ప్రస్తుతం భారత్లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదు. అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంది. భారత్లో ఇప్పటికీ నిష్పక్షపాత పరిస్థితులు లేవు. ఆ రోజులు వచ్చిన తర్వాత రిజర్వేషన్ల రద్దు గురించి మేం ఆలోచిస్తాం'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.''మీడియా, దర్యాప్తు ఏజెన్సీలతో ప్రజలను ఒత్తిడికి గురిచేసి.. బీజేపీ, ప్రధాని మోదీ భయాన్ని వ్యాప్తి చేశారు. కానీ, ఎన్నికల తర్వాత అదంతా తారుమారైంది. ఇప్పుడు బీజేపీ చూసి ఎవరూ భయపడట్లేదు. ఇప్పుడు పార్లమెంట్లో నేను ప్రధాని ముందుకెళ్లి.. '56 అంగుళాల ఛాతీ ఇక చరిత్రే' అని చెప్పగలను'' అని రాహుల్ ఎద్దేవా చేశారు. భారత్లో అన్ని రాష్ట్రాలు సమానమేనన్న ఆలోచనను ఆర్ఎస్ఎస్ అర్థం చేసుకోలేకపోతోందన్నారు.

**సోనియా నివాసం బయట నిరసనలు..**

భారత్లో మత స్వేచ్ఛపై రాహుల్ మాటలతో ఆయన తల్లి, హస్తం పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీకి నిరసన సెగ తగిలింది. బీజేపీ మద్దతున్న ఒక గ్రూప్ ఢిల్లీలోని ఆమె నివాసం బయట నిరసన చేపట్టింది.భారత్లో రాజకీయాల కంటే మత స్వేచ్ఛపైనే పోరాటం కొనసాగుతోందని రాహుల్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. కొన్ని వర్గాలు, భాషలు, మతాలను ఆర్ఎస్ఎస త్భద్రతా భావానికి గురిచేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన ఓ వర్గం గురించి ప్రస్తావించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఇదివరకే బీజేపీ నేత హర్దీప్ సింగ్ పురీ మాట్లాడుతూ.. ''రాహుల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. చరిత్రలో మా వర్గం ఒక్కసారైనా ఆందోళన, అభద్రత, అస్తిత్వ ముప్పు ఎదుర్కొన్నదంటే.. అది కేవలం గాంధీకుటుంబం అధికారంలో ఉన్న సమయంలోనే. ఇళ్ల నుంచి అమాయకులను బయటకుతీసుకువచ్చి.. టైర్లు వేసి సజీవ దహనం చేశారు. నాటి దాడుల్లో 3 వేల మంది ప్రాణాలు కోల్పోయారు'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నితమైన అంశాలపై మాట్లాడుతూ ప్రమాదకర వాతావరణాన్ని సృష్టించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని బీజేపీమండిపడిరది. తాజాగా బీజేపీ చెందిన సిక్ ప్రకోష్ గ్రూప్ నిరసనలకు దిగింది. వారిలో బీజేపీ నేత ఆర్పీ సింగ్ కూడా పాల్గొన్నారు. ఆయనతో పాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక రాహుల్ స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత.. 25వేలమందితో భారీ స్థాయిలో ఆందోళనకు యోచన చేస్తున్నట్లు నిరసనకారులు తెలిపారు.అయితే, విదేశీ గడ్డపై రాహుల్ దేశాన్ని కించపర్చేలా వ్యాఖ్యలు చేయడంతో బీజేపీ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు.

## దర్యాప్తు సంస్థలు నిజాలను నిగ్గు తేల్చాలి

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** కర్ణాటకలో సంచలనంగా మరిన వాల్మీకీ స్కామ్ డబ్బులనే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వాడిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ విషయంలో తాము చెప్పిందే నిజమైందన్నారు. ఈ మేరకు వాల్మీకి స్కామ్ పై బుధవారం ఎక్స్(ట్విట్టర్) వేదికగా ఆయన స్పందించారు. కర్ణాటకలోని గిరిజనుల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన సొమ్మును ఎన్నికల ప్రచారం కోసం వాడుకున్న కాంగ్రెస్ నేతలను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంలో కాంగ్రెస్ నేత, కర్ణాటక మాజీ మంత్రి బి.నాగేంద్ర కీలక సూత్రధారి అని ఈడీ ఛార్జ్ షీట్‌లో నిర్ధారించిందని కేటీఆర్ తెలిపారు. రూ. 187 కోట్ల రూపాయలు ఏకంగా కాంగ్రెస్ మంత్రి చేతుల మీదుగా దారి మళ్లించి, ఆ సొమ్మును తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మే 14న జరిగిన లోక్‌సభ ఎన్నికల కోసం ఉపయోగించిందని కేటీఆర్ ఆరోపించారు. వాల్మీకి స్కామ్‌లో ప్రధాన నిందితుడు సత్యనారాయణ వర్మ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బిల్డర్ అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతలతో సత్యనారాయణ వర్మకు అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయని తెలిపారు. వ్యాపారాల్లోనూ సత్యనారాయణ వర్మ ఇక్కడి కాంగ్రెస్ నేతలు భాగస్వాములుగా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇంకా చాలామంది కాంగ్రెస్ పెద్దలు ఉన్నారనేది నిర్వివాదమని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థలు వాల్మీకీ స్కామ్ గురించి నిజాలు నిగ్గుతేల్చాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరో స్కామ్‌కు తెరలేపినట్లు తెలుస్తోందని కేటీఆర్ తెలిపారు.. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ముచ్చర్ల ప్రాంతంలోని రెండు వేల ఎకరాల అభివృద్ధి పనులను దుబాయిలోని ఎమ్మార్ బిల్డర్స్‌కు అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ ఒప్పందం కోసం 11 ఏళ్లుగా కొనసాగుతున్న బౌల్డర్ హిల్స్ ప్రాజెక్టు కేసు నుంచి తప్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఎమ్మార్ బిల్డర్స్ కండిషన్ పెట్టినట్లు తెలుస్తోందన్నారు. బౌల్డర్ హిల్స్ ప్రాజెక్టు స్కామ్ కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మార్ ఎంజీఎఫ్ మధ్య జరిగిన వివాదాస్పద ఒప్పందమే కావడం గమనార్హం. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మార్ బిల్డర్స్ మధ్య తాజాగా ఒప్పందం జరిగినట్లు వస్తున్న కథనాలపై కేటీఆర్ స్పందించారు. ఈ ఒప్పందాన్ని చూస్తుంటే కాంగ్రెస్ పాలనలో మరో కుంభకోణం జరుగుతుందని అనిపిస్తోందన్నారు. స్కాంగ్రెస్ చేస్తున్న పనులను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

## సమ్మక్క-సారక్క ప్రాజెక్ట్‌కు అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయండి

**విశ్వంభర, హైదరాబాద్:** మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం ప్రాజెక్ట్ లపై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ నుండి తుది నివేదికను త్వరితగతిన తెప్పించాల్సిందిగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. వానాకాలంలో నిర్వహించాల్సిన పరీక్షలు నిర్వహించి అంతిమ నివేదికను ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీకి సమర్పించాలని ఆయన చెప్పారు.బుధవారం ఉదయం జలసౌదలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్డీఎస్ఏ కు అందించాల్సిన తుది నివేదికతో పాటు సమ్మక్క-సారక్క ప్రాజెక్ట్ కు చత్తీస్‌గఢ్ నుండి రావాల్సిన అనుమతులు, ముంపుకు గురయిన సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ నష్టపరిహారం విషయంలో ఛత్తీస్‌గఢ్‌ప్రభుత్వంతో చర్చలు తదితర అంశాలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమ్మక్క-సారక్క ప్రాజెక్ట్ కు ఛత్తీస్‌గఢ్ నుండి పొందాల్సిన అనుమతుల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు.అదే విదంగా ఇదే ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర జలవనరుల సంఘం లేవనెత్తిన అంశాలపై సత్వరమే నివృత్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. అదే విదంగా ఛత్తీస్‌గఢ్‌లో ముంపుకు గురయిన సమ్మక్క సాగర్ కు నష్టపరిహారం విషయంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ఆయన అధిరులకు చెప్పారు. ముఖ్యంగా ఆరు లక్షల కొత్త ఆయకట్టుకు నీరు అందించేందుకు చేపట్టిన ప్రాజెక్ట్ ల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ను 2025 మార్చి మాసంతానికి పూర్తి చెయ్యాలన్నారు. ఆనకట్టలు,కాలువల భద్రత కు అవసరమైన 1800 మంది లష్కరుల నియామకాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖా ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ స్పందిస్తూ ప్రక్రియను పూర్తి చేశామని ఆర్థిక శాఖా అనుమతులు పొందాల్సి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించగా అక్కడికక్కడే ఆర్థిక శాఖా కార్యదర్శి రామకృష్ణ రావు తో మాట్లాడి వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. అదే సమయంలో నీటిపారుదల శాఖాకు ప్రజా ప్రతినిధులు పంపిన విజ్ఞాపనలకు వెంటనే స్పందించి సకాలంలో జవాబు ఇవ్వాలన్నారు.ఇటీవల సంభవించిన వర్షపు విపత్తు ను ప్రస్తావిస్తూ ఆనకట్టలు,కాలువల భద్రతను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు.క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సమావేశం లో రాష్ట్ర ప్రభుత్వనీటిపారుదలశాఖా సలహాదారుడు ఆదిత్యాదాస్,ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఆర్%ద%ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇ.యన్.సి అడ్మిన్ అండ్ జనరల్ జి. అనిల్ కుమార్,ఓఅండ్ యం ఇ.యన్.సి నాగేందర్ రావు,ఇ.ఎన్.సి గజ్వేలు హరేరాం సి.ఇ లు రమణా రెడ్డి,అజయ్ కుమార్, విజయ్ భాస్కర్ రెడ్డిలతో పాటు డిప్యూటీ ఇ.ఎన్.సి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కూల్చివేతలపై స్టే తెచ్చుకున్నా.. కోర్టుల్లో కొట్లాడతాం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని వారి పట్ల ప్రభుత్వం మానవతా ధోరణితో వ్యవహరిస్తుందని చెప్పారు. మూసీ వెంట ఉన్న 11 వేల మంది బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామన్నారు.

**టీజీపీఎస్సీపై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవు..**

గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. తెలంగాణలో డిసెంబర్ 3న ప్రజాపాలన ఆవిర్భవించింది. కాంగ్రెస్ వచ్చాక 30 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించాం. మరో 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం. టీజీపీఎస్సీపై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవు. గతంలో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూసే పరిస్థితి. ప్రస్తుత ప్రభుత్వం నోటిఫికేషన్లు వరుసగా ఇస్తోంది. నిరుద్యోగుల వినతి ప్రకారం గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేశాం. సైబర్, గంజాయి నేరాలను ఉక్కుపాదంతో అణచివేయాలి. త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో వ్యసనాలకు తావు లేదు. కులవృత్తులతో పాటు చేతి వృత్తులను బలోపేతం చేస్తున్నాం. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపించాం. రైతులు ఆత్మగౌరవంతో తల ఎత్తుకునేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**నేరం జరగకుండా చూడటం ముఖ్యం: డీజీపీ జితేందర్**

శాంతి భద్రతలు, ప్రజలకు న్యాయం చేయడంలో ఎస్సైల పాత్ర కీలకమని డీజీపీ జితేందర్ తెలిపారు. నేరం జరిగినప్పుడు మాత్రమే స్పందించడం పోలీసుల పాత్ర కాదు, నేరం జరగకుండా చూడటం ముఖ్యమన్నారు. మారుతున్న సాంకేతికత ఆధారంగా అప్డేట్ అవుతూ ఉండాలని చెప్పారు. బృందంగా పనిచేసి ముందుకు వెళ్లాలని, ప్రజల నమ్మకం పొందాలని సూచించారు. సైబర్ నేరాల కట్టడిలో తెలంగాణ పోలీసులకు ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంతో చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

## ఇప్పటివరకు 262 అక్రమ నిర్మాణాలు కూల్చివేశాం

(మొదటి పేజీ తరువాయి)

262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. హైడ్రా గత రెండు నెలలుగా చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను ఎక్కడా ఉపేక్షించకుండా నేలమట్టం చేస్తోంది. రామ్‌నగర్ మణెమ్మ గల్లీలో 3, గగన్ పహాడ్ అప్పా చెరువులో 14, అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిధిలో 24, మాదాపూర్ సున్నం చెరువులో 42, దుండిగల్ కత్వా చెరువు పరిధిలో 13 అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు హైడ్రా వెల్లడించింది. అత్యధికంగా అమీన్‌పూర్‌లో 51 ఎకరాలు, మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. హైడ్రాకు ఐపీఎస్ అధికారి రంగనాథ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. దీనికి ప్రత్యేక పోలీసు సిబ్బందిని కేటాయిస్తూ డీజీపీ కార్యాలయం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. 15 మంది సీఐ స్థాయి, 8 మంది ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులు ఆక్రమణల కూల్చివేత కోసం పనిచేయనున్నారు. దీంతో హైడ్రా చర్యలు వేగవంతం కానున్నాయి.

## భూమి కోల్పోయిన వారిని మనం గౌరవించాలి

**విశ్వంభర , నల్లగొండ బ్యూరో:** యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రాజెక్టు కోసం భూమి కోల్పోయిన వారిని మనం గౌరవించాలి. మహోన్నత ఆశయం కోసం వారు భూమిని త్యాగం చేశారు. ప్రాజెక్టు ప్రారంభమయ్యేలా అర్హులైన వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఆయల్ సింకరైజేషన్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమా రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిల తో కలిసి పరిశీలించిన అనంతరం పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భూ నిర్వాసితులకు పరిహారం సత్వరమే చెల్లించాలని అధికారులను ఆదేశించారు. 2025 మార్చి కల్లా యాదాద్రిలో 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడమే టార్గెట్‌గా పెట్టుకోవాలన్నారు. కూలీలను పెద్ద ఎత్తున తీసుకోవాలని సూచించారు. పవర్ ప్లాంట్ నుంచి దామరచర్ల వరకు బొగ్గు రవాణా ఇతర అవసరాలకు నాలుగు లైన్ల ప్రత్యేక రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.

## బుడమేరు గండ్లు పూడ్చటానికి ఒక యుద్ధమే చేశాం

(మొదటి పేజీ తరువాయి)

రూ.10 వేలు పరిహారం చెల్లించనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు.గతంలో బుడమేరుకు గండ్లు పడితే వైసీపీ ప్రభుత్వం పూడ్చలేదని సీఎం చంద్రబాబు విమర్శించారు. ''వైసీపీ పాలనలో బుడమేరును ఆక్రమణలకు గురి చేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి.. అక్రమ కట్టడాలకు అనుమతులిచ్చారు. తప్పుడు బిల్లులతో డబ్బును కాజేశారు. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలే ఎక్కువ నష్టపోతారు. మంత్రి నిమ్మల రామానాయుడు బుడమేరు వద్ద 5 రోజులు ఉండి గండ్లు పూడ్చారు కాబట్టే విజయవాడకు వరద తగ్గింది. ప్రకాశం బ్యారేజీ వద్ద పడవలు వదిలింది వైసీపీకు చెందిన వారే. పడవలు వదిలిపెట్టి తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. అక్కడికి వచ్చినవి అక్రమ ఇసుక వ్యాపారం చేసిన పడవలే.

**విజయవాడలో సాధారణ పరిస్థితులకు 10 రోజులు పట్టింది..**

నేరాలు చేసే వ్యక్తులు.. ప్రజా జీవితంలో ఉంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వైకాపా మొత్తం దోచేసింది. అప్పులు మిగిల్చారు.. వాటిని భర్తీ చేస్తున్నాం. ఖాళీ ఖజానాతో అభివృద్ధి ఆగిపోయింది. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవు.. అయినా నెట్టుకుంటూ వస్తున్నాం. కృష్ణా నదికి ఊహించని విధంగా వరద వచ్చింది. గత ప్రభుత్వ తప్పిదాలతో విజయవాడ అతలాకుతలమైంది. దీంతో బుడమేరుకు గండ్లు పడ్డాయి. టీడీపీ హయాంలో మంజూరు చేసిన నిధులనూ పక్కన పెట్టారు. ఎక్కడా ఒక డ్రెయిన్, కాలువ తవ్విన పాపాన పోలేదు.గత ఐదేళ్ల దుర్మార్గ పాలనలో వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టాయి. పనిచేసే వ్యక్తులు పనిచేయడం మానేశారు. విజయవాడలో సాధారణ పరిస్థితులు రావడానికి 10 రోజులు పట్టింది. బుడమేరు గండ్లు పూడ్చటానికి ఒక యుద్ధమే చేశాం. ఆర్మీ వాళ్లే మావల్ల కాదని చేతులెత్తేశారు. మా మంత్రులు దగ్గరుండి గండ్లు పూడ్పించారు. ప్రకాశం బ్యారేజీ కొట్టుకుపోతే లంక గ్రామాలు ఏమైపోతాయి? అప్పుడు బాబాయిని చంపి నెపం నెట్టారు.. ఇప్పుడు బోట్లతో విధ్వంసం సృష్టించాలని కుట్ర పన్నారు. నేరాలు చేసే వారు ప్రజా జీవితంలో ఉంటే ఇలానే ఉంటుంది. నేరస్థులు రాజకీయ ముసుగు వేసుకున్నారు'' అని చంద్రబాబు విమర్శించారు.



# "మిస్టర్ రాహుల్ గాంధీ..క్విట్ ఇండియా"

○ శేరిలింగంపల్లి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్



**విశ్వంభర, శేర్ లింగంపల్లి :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. విదేశాల్లో పర్యటిస్తూ భారత్ ను కించపర్చడమే కాకుండా ఎన్నికల వ్యవస్థను విమర్శిస్తున్న రాహుల్ గాంధీకి ఈ దేశంలో ఉండే అర్హత లేదని మండిపడ్డారు. "మిస్టర్ రాహుల్ గాంధీ... క్విట్ ఇండియా" అని నినదించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసి పోటీ చేయబోతున్నాయని చెప్పిన బండి సంజయ్... అందరూ కలిసి పోటీ చేసినా ఈసారి జీహెచ్ఎంసీపై కాషాయ జెండాను ఎగరేసి తీరుతామని, మేయర్ పదవిని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. "రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తడనుకున్న. కానీ రేవంత్ తో సాధ్యం కావడం లేదు. ఎందుకంటే కేసీఆర్ కు కాంగ్రెస్ లో ఎవరిని పట్టుకుంటే పనైతదో తెలుసు. అందుకే ఢిల్లీ పోయి కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడుకుని వచ్చిండు... అందుకే కేసీఆర్ కుటుంబం జోలికి రేవంత్ రెడ్డి వెళ్లడం లేదు. అదే బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే కేసీఆర్ కుటుంబం అంతు చూసేటోళ్లం. అంకుశం సినిమాలో రాంరెడ్డిని ఎట్లా గుంజుకుపోయి జైల్లో వేశారో... అట్లనే కేసీఆర్ కుటుంబాన్ని గుంజుకుపోయి జైల్లో వేసేటోళ్లం. ఎందుకంటే కేసీఆర్ అన్ని అరాచకాలు చేసిండు."అని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి ఎస్పార్ కన్వెన్షన్ హాలులో రంగారెడ్డి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కూన రవి కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు...సభ్యత్వ నమోదు విషయంలో అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ. ఇన్సూరెన్స్, ఇతర తాయిలాల ఆశ చూపకుండా సభ్యత్వ నమోదు చేయిస్తున్న పార్టీ బీజేపీ. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏ డివిజన్ లో అత్యధికంగా సభ్యత్వాన్ని నమోదు చేస్తారో... ఆ డివిజన్ లోని బీజేపీ నాయకులందరినీ ఘనంగా సన్మానిస్తాం.2028లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా. అంతకుముందు జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వందకు వంద శాతం మేయర్ పదవిని బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యం. ఎంఐఎం గోడదూకే పార్టీ. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొంది. రాబోయే ఎన్నికల్లో ఆ మూడు పార్టీలు ఒక్కటై పోటీ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ ఎన్నికల్లో గెలుపు మనదే. జీహెచ్ఎంసీని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కేసీఆర్, రేవంత్ రెడ్డి, ఒవైసీ ఒక్కటై పోటీ చేసినా బీజేపీ ఎదుర్కొవడం తోపాటు గెలిచి తీరుతాం. జీహెచ్ఎంసీ ఎవడి అయ్య జాగీరు కాదు. ఎంఐఎం పార్టీ ఆనవాళ్లు లేకుండా చేస్తాం. తెలంగాణలో ఎంఐఎం ఆనవాళ్లు లేకుండా చేస్తాం.

బీజేపీ సభ్యత్వం ఎందుకు తీసుకోవాలంటే.... బీజేపీ సభ్యత్వమే ఎందుకు తీసుకోవాలి? ఇతర పార్టీలకు, బీజేపీకి ఉన్న తేడా ఏందో తెలుసా? కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా దేశంలోని పార్టీలన్నీ కుటుంబ, వారసత్వ పార్టీలు. అవినీతి పార్టీలు. రాష్ట్రానికి, ప్రాంతాలకే పరిమితమైన పార్టీలు. అవకాశవాద రాజకీయ పార్టీలు....కమ్యూనిస్టు పార్టీలకు క్యాడర్ పార్టీ.. కానీ ఓటర్లు లేని పార్టీ. కానీ బీజేపీ భిన్నమైన పార్టీ... దేశం కోసం పనిచేసే జాతీయవాద భావాలున్న పార్టీ. దేశం కోసం ప్రాణాలిచ్చే పార్టీ. కార్యకర్తల త్యాగాలు, పునాదులపై ఏర్పడ్డ పార్టీ. అట్టడుగునున్న పేదవాడికి సైతం ప్రభుత్వ ఫలాలు అందించాలని 'అంత్యోదయ' సిద్దాంతంతో పనిచేస్తున్న పార్టీ. సామాన్య కార్యకర్తను కూడా ప్రధానమంత్రిని, కేంద్ర, రాష్ట్ర మంత్రులను, రాష్ట్ర, జాతీయ అధ్యక్షులను చేసిన పార్టీ. 25 కోట్ల మందికి పేదరికం నుండి విముక్తి కలిగించిన పార్టీ. దేశ రక్షణ కోసం అణ్వస్త్రాలు ఉండాలని దీన్ దయాళ్ ఆశిస్తే... అమలు చేసిన ప్రధాని వాజ్ పేయి. 370 ఆర్టికల్ రద్దు కోసం శ్యామాప్రసాద్ బలిదానం చేస్తే... ఆ స్పూర్తితో 370 ఆర్టికల్ ను రద్దు చేసిన మోదీ. మహిళలకు సమాన హక్కులు, వేతనాలివ్వాలని పార్లమెంట్ లో అంబేద్కర్ అడిగితే...అవమానించిన పార్టీ కాంగ్రెస్. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ మహిళలకు చట్టసభల్లోనూ 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన పార్టీ బీజేపీ. దేశవిభజనవల్ల ఇతర దేశాల్లో నష్టపోయిన హిందువులందరికీ ఉమ్మడి పౌరస్మృతి కల్పించాలనే ఆశయాన్ని నెరవేర్చిన పార్టీ.

ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వమున్న పార్టీ బీజేపీ. 2014లో 11 కోట్లు.. 2019లో 7 కోట్లు... కలిపి మొత్తం 18 కోట్ల మంది సభ్యులున్న అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ బీజేపీ. చైనాలోని నియంత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని అధిగమించి రికార్డు సృష్టించిన పార్టీ బీజేపీ. ఈసారి దేశవ్యాప్తంగా అదనంగా 10 కోట్ల మందితో సభ్యత్వం నమోదు చేయించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నం. తెలంగాణలో 50 లక్షల మంది సభ్యత్వం టార్గెట్... పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుండి బీజేపీకి పడ్డ ఓట్లు 77 లక్షలకుపైనే. ఈ ఓటర్లందరినీ బీజేపీ మద్దతుదారులుగా చేర్చాలి. అందుకోసం మీరంతా గడప గడపకూ తిరగాలి. ఈ మద్దతుదారులందరినీ సభ్యులుగా మార్చాలి. ఆ సభ్యులే రేపు కార్యకర్తలుగా, నాయకులుగా తీర్చదిద్దడమే లక్ష్యం.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి వేయాల్సిన ఓట్లు పొరపాటున కాంగ్రెస్ కు వేశారు. ఎందుకంటే పోరాటాలు చేసింది బీజేపీ... పొరపాటున చెయ్యి గుర్తుకు ఓట్లేస్తే అది నేడు భస్మాసుర హస్తమైందని బాధపడుతున్నరు. అదే పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే... ఆ పువ్వు వికసించేదని అనుకుంటున్నరు. ఇగ కేసీఆర్ అరాచక పాలన సంగతి చెప్పనక్కర్లేదు. ప్రజల కోసం పోరాడుతున్న బీజేపీ కార్యకర్తలపై కేసులు పెట్టి, రౌడీషీట్లు పెట్టి వేధించిండు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తడనుకున్న. కానీ రేవంత్ తో సాధ్యం కావడం లేదు. ఎందుకంటే కేసీఆర్ కు కాంగ్రెస్ లో ఎవరిని పట్టుకుంటే పనైతదో. అందుకే ఢిల్లీ పోయి మాట్లాడుకుని వచ్చిండు... అందుకే కేసీఆర్ కుటుంబం జోలికి రేవంత్ రెడ్డి వెళ్లడం లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే కేసీఆర్ కుటుంబం అంతు చూసేటోళ్లం. అంకుశం సినిమాలో రాంరెడ్డిని ఎట్లా గుంజుకుపోయి జైల్లో వేశారో... అట్లనే కేసీఆర్ కుటుంబాన్ని గుంజుకుపోయి జైల్లో వేసేటోళ్లం. ఎందుకంటే కేసీఆర్ అన్ని అరాచకాలు చేసిండు. మా కార్యకర్తలపై కమ్యూనల్ షీట్లు, రౌడీ షీట్లు ఓపెన్ చేసి విపరీతంగా వేధించిండు. నాపై 109 కేసులు పెట్టిండు. ఇప్పటికీ ఆ కేసుల విషయంలో నిరంతరం కోర్టులు చుట్టూ తిరుగుతున్నం.

రాష్ట్రంలో అతి తక్కువ కాలంలోనే అత్యధిక ప్రజా వ్యతిరేక మూటకట్టుకున్న పార్టీ కాంగ్రెస్ మాత్రమే. 6 గ్యారంటీల పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులెత్తిసిన పార్టీ. మహిళలకు తులం బంగారం, నెలనెలా రూ. 2500లు, స్కూటీ ఇస్తానన్నరు. నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భ్రుతి ఇస్తామన్నరు. వృద్ధులకు ఆసరా పెన్షన్లు ఇస్తామన్నరు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇస్తామన్నారు. ఈ హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రజలు నిలదీస్తుంటే... చర్చను పక్కదారి పట్టించేందుకే రుణమాఫీ సర్వే పేరుతో సాగదీస్తున్నరు. హైడ్రా పేరుతో హైడ్రామాలాడుతున్నరు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కాంప్రమేజ్ పొలిటిక్స్ చేస్తున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతిపై విచారణ పేరుతో కాంగ్రెస్ సాగదీస్తూ ఆ కుటుంబాన్ని కాపాడుతుంటే.... అందుకు ప్రతిఫలంగా బీఆర్ఎస్ నేతలు 6 గ్యారంటీలపై నిలదీయకుండా విగ్రహాల లొల్లి, ఇతర అంశాలపై రాజకీయం చేస్తున్నరు


*శ్యామాప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, అంబేద్కర్ స్పూర్తితో బీజేపీ ముందుకుపోతూ ఈ దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలబెట్టేందుకు అహర్నిశలు క్రుషి చేస్తుంటే....రాహుల్ గాంధీ మాత్రం విదేశాలకు పోయి భారత్ పరువు తీస్తున్నడు. గత ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి 'భారత్ లో ప్రజాస్వామ్యంలో ఉంది. విదేశాలు జోక్యం చేసుకోవాలన్నడు. నిన్న అమెరికాలో 'భారత ఎన్నికల సంఘం మోదీ చేతిలో ఉంది. సరిగా పనిచేయడం లేదు. ఇయాళ 'రిజర్వేషన్లను రద్దు చేస్తాం'అని విదేశీ గడ్డపై అంటున్నడు. నేనడుగుతున్నా.... కాంగ్రెస్ నేతలారా... దీనికి మీరేం సమాధానం చెబుతారు. తక్షణమే రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి. ఈ దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు, రెండు విధానాలు ఉండటానికి వీల్లేదని బీజేపీ 370 ఆర్టికల్ ను రద్దు చేస్తే.... అందుకు భిన్నంగా పాకిస్తాన్ కు తొత్తుగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీతో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటు. అందుకే ఈ వేదికగా కోరుతున్నా... ఈ దేశంలోని రాజ్యాంగం, చట్టాలు, ఎన్నికల సంఘంపై నమ్మకం లేని రాహుల్ గాంధీకి ఈ దేశంలో ఉండే అర్హత లేదు. అందుకే చెబుతున్నా 'రాహుల్...క్విట్ ఇండియా'. ఈ దేశంలో ఒకే త్రివర్ణ పతాకం ఎగరాలన్నదే బీజేపీ నినాదం. కాశ్మీర్ లో రెండు జెండాలు ఎగరేయాలనుకునే పార్టీలను తరిమితరిమి కొట్టాలని కోరుతున్ననని పేర్కొన్నారు

*లౌకిక వాదం గురించి మాట్లాడే కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీల నేతలారా.... జైనూర్ ఘటనపై ఎందుకు స్పందించడం లేదు? ఒక ఆదివాసీ గిరిజన మహిళపై షేక్ మగ్దూం అనే నీచుడు లైంగికదాడి చేసి హత్యాయత్నం చేస్తే నోరెందుకు విప్పడం లేదు? ఈ ఘటనపై ప్రశ్నించిన హిందువులపై దాడులు చేసి అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసి జైల్లో పెడితే మీరెందుకు స్పందించడం లేదు? హిందువులపై దాడులు జరుగుతుంటే, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుంటే హిందుత్వం గురించి నేను మాట్లాడితే తప్పా? హిందువుల పండగలపై నిబంధనలు పెడితే నోరు విప్పరు. గణేశ్ మండపాల పెడితే పర్మిషన్ అడుగతరు. కేసులు పెడతరు. ముస్లిం పండుగలకు మాత్రం పర్మిషన్ అవసరం లేదంటరు. ఇట్లా... హిందువులపై జరుగుతున్న అన్యాయాన్ని పశ్నించని వాడు నా ద్రుష్టిలో హిందువే కాదు. అట్లాంటి వాడు నా దృష్టిలో భారతీయుడే కాదు. దయచేసి ప్రతి ఒక్కరూ హిందువులపైన, పేదల పైన జరుగుతున్న అన్యాయాలపై నిలదీయాలని కోరుతున్నా. ఈ విషయంలో ముందున్న బీజేపీకి మద్దతివ్వాలని వేడుకుంటున్నానని అన్నారు.

# ఉప్పల లింగస్వామిని పరామర్శించిన ఎంపీ ఈటెల రాజేందర్




**విశ్వంభర, సంస్థాన్ నారాయణపుర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పల లింగస్వామి తండ్రి ఉప్పల పెద్దులు మరణించగా బాధిత కుటుంబ సభ్యులను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ విచ్చేసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.






## మెట్టుగూడలో చాకలి ఐలమ్మ వర్ధంతి

**విశ్వంభర, సికింద్రాబాద్ :** మెట్టుగూడ లో బిజెపి ఓబీసీ మోర్చా రజక సెల్ స్టేట్ కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 39 వ వర్ధంతి మెట్టుగూడ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధ మల్ల ఆనంద్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, హరి, శారద మల్లేష్, సరోజా, అనూష, రాజమణి, నవనీత, సర్వేశ్, పలువురు బీజేపీ ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు తెలంగాణ పోలీసులు రూ.11కోట్ల విరాళం




**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణ పోలీసులు మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వరదల కారణంగా నష్టపోయిన వారికి సాయం చేసేందుకు తమ వంతు సాయమందించారు. ప్రభుత్వం పిలుపు మేరకు వరద బాధితుల సహాయార్థం ప్రముఖులు, సెలబ్రిటీలు, నేతలు, ప్రజలు సీఎం సహాయనిధికి భారీగా విరాళాలు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే వరద బాధితుల కోసం తెలంగాణ పోలీసులు ఒక రోజు జీతాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ లోని తెలంగాణ పోలీసు అకాడమీలో బుధవారం ఎస్సై పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. పాసింగ్ అవుడ్ పరేడ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్ కి ప్రకటించిన పోలీసుల ఒక్క రోజు జీతం రూ.11,06,83,571 చెక్ ను డీజీపీ సహా ఇతర పోలీస్ ఉన్నతాధికారులు సీఎంకి అందజేశారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇటీవల భారీ వరదలు సంభవించి పలు ప్రాంతాలు జలమయమైన విషయం తెలిసిందే. ఎంతో మంది నిరాశ్రయులు అయ్యారు.ఇళ్లలోకి నీరు చేరడంతో చాలా మంది ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఇంట్లో దాచుకున్న బంగారం,డబ్బు కూడా వరదల్లో కొట్టుకుపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న చాలామంది దృశ్యాలు మనం నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. రైతులు కూడా పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందులును ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేల పరిహారం తమకు సరిపోదని..లక్ష రూపాయలు పరిహారంగా ఇస్తే తమకు కొంచెమైనా కోలుకునేందుకు అవకాశముంటుందని బాధితులు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

## రాయల్ డైమండ్ మొదటి వార్షికోత్సవం




**విశ్వంభర, వనస్థలిపురం :** రాయల్ డైమండ్ మొదటి వార్షికోత్సవం ఎల్బీనగర్ కేకే గార్డెన్లో ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరములోనే తమ వెంచర్స్ 90% రిజిస్ట్రేషన్స్ పూర్తి చేసి కస్టమర్స్ కు అందించిన తమ సంస్థ వెంచర్స్ కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం, యాచారం, శ్రీశైలం హైవేలో, మైసగండి టెంపుల్, ఆమనగల్ మొదలగు ప్రాంతాల్లో ఉన్నాయని సీఈవో పత్య నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో నగేష్, అధినేత రాచకొండ మల్లాచారి మార్కెటింగ్, అసోసియేట్స్, కస్టమర్స్, తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి మండపాలల్లో కార్పొరేటర్ బన్నాల ప్రత్యేక పూజలు



**విశ్వంభర, చిల్కానగర్ :** ఉప్పల్ డివిజన్ల పరిధిలోని టీచర్స్ కాలనీ, బీరప్ప గడ్డ, సాయిరాం నగర్, చిల్కానగర్ గుట్ట, ఉప్పల్ భరత్ నగర్‌లోనీ కడిగి శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం, సుభాష్ గౌడ్ సాయిరాం నగర్‌తోపాటు వివిధ బస్తీల్లో ఏర్పాటు చేసిన గణేశుడి మండపాలను కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో కార్పొరేటర్ పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బలు రామాంజనేయులు, శ్యామ్, సాయిబాబా(బంటి), కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# కాషాయ విప్లవకారుడు, ఆధ్యాత్మిక సామ్యవాది స్వామీ అగ్నివేశ్



ఆర్య సమాజ్ నేత, సామాజిక ఉద్యమ కారుడు స్వామి అగ్నివేశ్ (80) తెలంగాణ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇచ్చారు. దేశ వ్యాప్తంగా జరిగిన అనేక సామాజిక ఉద్యమాలకు, పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచారు. స్వామి అగ్నివేశ్ భ్రూణహత్యలు, వెట్టిచాకిరి, మహిళా సమస్యలపై, సామాజిక అంతరాలపై గొంతెత్తారు. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకు సంపూర్ణ మద్దతు తెలపడమే కాకుండా, ఉద్యమ కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పాల్గొని, ఉద్యమ కారులను బలం చేకూర్చారు. ఆయనను కాషాయ విప్లవకారుడు, ఆధ్యాత్మిక సామ్యవాదిగా చెప్పవచ్చు. 1939 సెప్టెంబర్ 21న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళంలోని సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన అసలు పేరు వేపా శ్యాంరావు. నాలుగేళ్లకే తండ్రి మరణించడంతో అనంతరం ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న శక్తి అనే రాజ్యంలో దివాన్ అయిన తన తాత వారింట పెరిగారు. కోల్‌కతా లోని సెయింట్ గ్లేవియర్ కాలేజీ న్యాయశాస్త్రం, వాణిజ్యంలో డిగ్రీలు సంపాదించారు. కోల్‌కతా లోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశారు. సభ్యసాచి ముఖర్జీ అనే ప్రఖ్యాత న్యాయవాది వద్ద జూనియర్ లాయర్‌గా పనిచేశారు. ఆ తర్వాత సభ్యసాచి ముఖర్జీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అయ్యారు. ఆర్య సమాజ్ సూత్రాలతో 1970లో "ఆర్యసభ" అనే రాజకీయ పార్టీని స్థాపించారు. అంతేకాక, ఆయన ప్రముఖ న్యాయవాదిగా మత పరమైన సమస్యలపై మాత్రమే కోర్టులో వాదించే వారు. ఎన్నో సామాజిక సమస్యలపై పోరాటం చేశారు. ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణ హత్యలు ఎక్కువగా చేయిస్తున్న రోజుల్లో అందుకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల హక్కులు, భ్రూణ హత్యలకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో మావోయిస్టులతో జరిగిన చర్చలకు ఆయన మధ్య వర్తిత్వం వహించారు. 1977లో హర్యానాలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతేగాక, మంత్రిగానూ ఆయన సేవలందించారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 1981లో ఆయన మంత్రిగా ఉన్న సమయం లోనే బాలల వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు "బాండెడ్ లేబర్ లిబరేషన్ ఫ్రంట్"ను స్థాపించారు. మాయిస్టులతో చర్చలు జరపడంలో కీలకంగ పాత్ర పోషించారు. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా గళమెత్తారు. ముఖ్యంగా ఢిల్లీ చుట్టుపక్కల ఉండే క్వారీల్లో కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. హత్యానేరం ఆరోపణల్లో 14 నెలలు జైలు శిక్ష కూడా అనుభవించారు. 2011వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో అగ్నివేష్ కూడా పాలు పంచు కున్నారు. కొందరు నిరసన కారులు తన మీద వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలతో దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆయన ఆందోళనల నుంచి విరమించు కున్నారు. 2011 సంవత్సరంలోనే మావోయిస్టులు కిడ్నాప్ చేసిన ఐదుగురు ఛత్తీస్‌గఢ్ పోలీసులను విడిపించడంలో మావోయిస్టులతో జరిపిన బృందంలో అగ్నివేష్ కూడా ఒకరు.

1970లో సన్యాసం స్వీకరించారు స్వామి అగ్నివేష్. అయితే, ఆయన మీద హిందూ వ్యతిరేక ముద్ర పడింది. ఒడిశాలోని పూరీ జగన్నాథ్ ఆలయాన్ని హిందుయేతరుల కోసం కూడా తెరవాలంటూ ఆయన డిమాండ్ చేశారు. హిందువులు అత్యంత పవిత్రంగా పూజించే అమర్‌నాథ్ శివలింగం కేవలం ఓ మంచు ముక్క అంటూ అగ్నివేష్ కామెంట్స్ చేయడంతో హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్‌పై జార్ఖండ్ తదితర ప్రాంతాలలో ఆయనపై ఏబీవీపీ, బీజేవైఎం, బీజేపీ కార్యకర్తలు పలుమార్లు దాడులు కూడా చేశారు. అయితే, అగ్నివేష్ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కోట్లాది మంది మనోభావాలను దెబ్బ తీయడం సరికాదని స్పష్టం చేసింది. సెంటిమెంట్ మిళితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. 2008లో ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో జరిగిన జమైత్ ఉలేమా ఈ హింద్ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలకు హిందూ సంఘాల నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఎవరో కొందరు ఉగ్రవాదులు చేసే తప్పుడు పనులకు మొత్తం మతాన్ని తిట్టడం సరికాదని ఆయన అన్నారు. అసలు అమెరికానే నెంబర్ వన్ టెర్రరిస్టు అని కూడా అన్నారు.

అగ్నివేష్ బిగ్ బాస్‌లో కూడా పాల్గొన్నారు. 2011 సంవత్సరంలో నవంబర్ 8 నుంచి 11 వరకు హిందీ బిగ్ బాస్ హౌస్‌లో అతిథిగా ఉన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులతో జరిగిన చర్చలకు ఆయన మధ్యవర్తిత్వం వహించారు. భిన్న మతాల మధ్య పలు అంశాలపై ఆయన వారధిగా పనిచేశారు.

తెలంగాణ ఉద్యమానికి స్వామి అగ్నివేష్ మొదటినుంచి సంపూర్ణ మద్దతుగా నిలిచి, ఉద్యమ సందర్భంలో జరిగిన సమావేశాలు, కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్నారు. కాలేయ సంబంధిత సమస్యతో ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్‌లో చేరి, శరీరంలో కొన్ని అవయవాలు విఫలం (మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్) చెందడంతో కొద్ది రోజులు ఆయన వెంటిలేటర్ పైనే చికిత్స పొందుతూ, 2020 సెప్టెంబర్ 11న శుక్రవారం మృతి చెందారు. ఆధ్యాత్మికం, మత పరమైన అంశాలపై స్వామి అగ్నివేశ్ పలు పుస్తకాలు కూడా రాశారు. రాజీవ్ గాంధీ నేషనల్ సద్భావనా అవార్డు, రైట్ లైవ్లీహుడ్ అవార్డులు ఆయనను వరించాయి.

## తొలిమహిళా న్యూస్ రీడర్
# ఆంధ్రా నైటింగేల్ మంగమ్మ

**జోలెపాళ్యం మంగమ్మ. అలనాటి రేడియో శ్రోతలకు సుపరిచితమైన పేరు. నేడు ఆకాశవాణి ప్రపంచము లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. భారత ప్రభుత్వ సమాచార , ప్రసార మంత్రిత్వశాఖ అధ్వర్యములో పని చేస్తుంది. రేడియో వార్తలు నిబద్ధతకు, విశ్వసనీయతకు తొలినాళ్ళ నుండి పేరు పొందాయి. సమాచార వ్యవస్థ పటిష్ఠంగా లేని రోజుల్లో రేడియో వార్తల కోసం జనం ఆసక్తిగా ఎదిరి చూసే వారు. ఒకప్పుడు రేడియో మాత్రమే ఒక సమాచార సాధనంగా ఉన్న పాతకాలపు మరచి పోలేని రోజులలో, ప్రజలకు వార్తలు ఎప్పటికప్పుడు తెలియచేస్తూ ప్రజలలో ఒకరిగా, అందరికీ ఆత్మీయులుగా వార్తా చదువరులు తమ తమ శైలులలో సుస్థిర స్థానం సంపాయించు కొన్నారు. ఆకాశవాణిలో వార్తా చదువరులుగా (న్యూస్ రీడర్స్), ఎంతగానో ప్రాచుర్యం పొందిన వారిలో న్యూస్ రీడర్సుది ప్రథమ స్థానం. ఆ విధంగా తెలుగులో ఇటు ప్రాంతీయ కేంద్రాలైన విజయవాడ, హైద్రాబాదు నుండి వచ్చే ప్రాంతీయ వార్తలు, అటు హస్తిన నుండి వచ్చే జాతీయ వార్తలు ప్రజలకు కావలిసిన విశేషాలను నిర్ణీత సమయ సారిణి ప్రకారం తెలియ చెప్పేవి.**

### నేడు ఆమె జయంతి



ఆ రోజుల్లో ఢిల్లీ నుంచి తెలుగు వార్తలు చదివే ఒక్కొక్కరిదీ ఒక్కొక్క బాణీ. ఎవరి స్టైల్ వారిదే.ప్రముఖ సినీ నటుడు కొంగర జగ్గయ్య,కపిల, కాశీపతి, శ్రీ వాత్సవ, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, పన్యాల రంగనాధరావు, వనమాలి ప్రసాద్, జోళిపాళ మంగమ్మ, కందుకూరి సూర్యనారాయణ, తిరుమలశెట్టి శ్రీరాములు, అద్దంకి మన్నార్, వావిలాల రాజ్యలక్ష్మి, దుగ్గిరాల పూర్ణయ్య, ఏడిద గోపాలరావు వార్తలు చదవడంతో తెలుగువారి హృదయాలకు సన్నిహితులయ్యారు. ఇలా ఎందరో మహానుభావులు. ఎవరికి ఎవరు తీసిపోరు. వార్తలు మధ్య నుంచి విన్నా చదువు తున్నది పలానా అని చెప్ప గలిగేలా తమదయిన తరహాలో వార్తలు చదివే వాళ్ళు.

ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో తెలుగు న్యూస్ రీడర్‌గా, ఢిల్లీ తెలుగు న్యూస్ విభాగంలో దశాబ్ధ కాలానికి పైగా సేవలందించిన మంగమ్మ తెలుగు రేడియో శ్రోతలకు చిర పరిచయస్థురాలు. "ఆకాశవాణి.. వార్తలు చదువుతున్నది జోలిపాళ్యం మంగమ్మ" అంటూ తెలుగు శ్రోతలకు వార్తలు వినిపించిన చిరపరిచిత స్వరం ఆమెది. జోలిపాళ్యం మంగమ్మతో పాటు , విభాగ అధిపతి దుగ్గిరాల పూర్ణయ్య, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి, కందుకూరి సూర్యనారాయణ, ఏడిద గోపాలరావు, అద్దంకి మన్నార్ తదితరులు ఆమె సహచరులు.

జోలెపాళ్యం మంగమ్మతెలుగు రచయిత్రి, రేడియో వార్తా చదువరి. మంగమ్మ ఆల్ ఇండియా రేడియోలో మొట్టమొదటి మహిళా న్యూస్ రీడర్‌గా ప్రసిద్ధురాలుగా పేరెన్నిక గన్నారు .

ఆమె చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1925, సెప్టెంబరు 12న జన్మించారు. ఎం.ఎ., బి.ఎడ్ చదివారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను పొందారు. ఈమెకు తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచ్, ఎస్పరాంటో, తమిళ, హిందీ భాషలలో ప్రావీణ్యం ఉంది. ఈమె ఆలిండియా రేడియో న్యూఢిల్లీలో 10 సంవత్సరాలు ఎడిటర్‌గా, న్యూస్ రీడర్‌గా విధులు నిర్వర్తించారు. 1962 నుండి నేషనల్ ఆర్కీవ్స్, ఢిల్లీలో పరిశోధనలు చేశారు. బోధనా రంగంలో సుమారు పాతిక సంవత్సరాల అనుభవం సంపాదించారు. ఈమె కేంద్ర సమాచార శాఖ, విదేశాంగ శాఖలలో కీలకమైన పదవులను నిర్వహించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొదలైన సంస్థలలో జీవిత సభ్యురాలు. ఇంకా ఈమె అనిబీసెంట్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఉపాధ్యక్షురాలిగా, గాంధీ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప మెంట్ అధ్యక్షురాలిగా, లోక్ అదాలత్‌లో సభ్యురాలిగా వివిధ హోదాల్లో సేవలను అందించారు. ఆమె ఇంగ్లీషు, తెలుగు భాషలలో పలు పుస్తకాలను రచించారు. న్యూఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారం, సిద్ధార్థ కళాపీఠం (విజయవాడ) విశిష్ట అవార్డు మొదలైన సత్కారాలను పొందింది. సరోజినీ నాయుడు అనుయాయిగా ఈమె పేరు గడించారు. "ఆంధ్రానైటింగేల్" అనే బిరుదును పొందారు. తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు (1746-1856), ఆంధ్రదేశంలో క్రైస్తవ మిషనరీల సేవ, ఇండియన్ పార్లమెంట్,

శ్రీ అరబిందో, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, అనిబీసెంట్ పుస్తకాలను ఆమె తెలుగులో వెలువరించారు. అలాగే ప్రింటింగ్ ఇండియా, అల్లూరి సీతా రామరాజు, లాస్ట్ పాలెగార్ ఎన్‌కౌంటర్ విత్ ది బ్రిటిష్ ఇన్ ది సీడెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1846-1847, ది రేట్ స్కూల్స్ ఆఫ్ గోదావరి పుస్తకాలను ఆంగ్లంలో రచించారు. మదన పల్లెలోని తన స్వగృహంలో 2017, ఫిబ్రవరి 1వ తేదీన తన 92వ యేట వృద్ధాప్య సమస్యలతో మరణించారు.

## ఆధునిక తమిళ సాహిత్యానికి మార్గదర్శకుడు
# సుబ్రహ్మణ్య భారతి

చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి' తమిళ రచయిత, కవి, పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. ఆధునిక తమిళ కవిత్వానికి మార్గదర్శిగానూ, "మహాకవి భారతి"గానూ సుప్రసిద్ధుడు, తమిళ సాహిత్య ప్రముఖుల్లో అత్యున్నత వ్యక్తిగా పేరొందారు. ఆయన అసంఖ్యాక రచనలు భారత స్వాతంత్ర ఉద్యమ కాలంలో దేశభక్తి, జాతీయత వంటి భావాలను వెలుగొందేలా చేశాయి.



భారతి చిన్నసామి సుబ్రహ్మణ్య అయ్యర్, లక్ష్మీ అమ్మాళ్ దంపతులకు సుబ్బయ్యగా 11 డిసెంబర్ 1882 లో డిసెంబర్ 11న ఎట్టయపురం గ్రామంలో జన్మించారు. తిరునల్వేలిలోని ఎం.డి.టి. హిందూ కళాశాల అన్న స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. యుక్త వయసు నుంచి సంగీతం అభ్యసించడం, 11వ యేటనే కవితలల్లడం నేర్చారు. విద్యలకు అధిదేవత అయిన సరస్వతీ దేవి పేరిట "భారతి" అన్న బిరుదాన్ని ఆ సమయంలోనే ఆయన పొందారు. విశేషమైన పట్టుదల, కృషితో ఆయన 32 భాషలు (29 భారతీయ భాషలు, 3 విదేశీ భాషలు) నేర్చుకున్నారు.

స్త్రీలు రాజకీయాల్లో భాగస్వాములు కావాలని ప్రబోధిస్తూ, ఉద్యమించిన వారిలో తొట్టతొలి సంస్కర్తగా భారతిని భావిస్తారు. భారతి స్త్రీల హక్కుల గురించి, వారి విద్య గురించి విస్తృత స్థాయిలో ఆలోచించారు. స్త్రీ పురుషులు ఇద్దరూ సమానులేనని భావిస్తే ప్రపంచం వైజ్ఞానికంగా, మేధాపరంగా సమున్నతంగా విలసిల్లుతుందని భారతి భావించారు. స్త్రీల హక్కులకు భంగం కలిగించేలా మాట్లాడిన శాస్త్రాలను, ఆచారాలను ఆయన ఖండించారు. ఆయన భావాల్లో చాలావరకూ ఆధునిక కాలానికి కూడా సమకాలీనంగా నిలవడం విశేషం.

హిందూ సమాజంలోని కుల వ్యవస్థకు కూడా భారతి వ్యతిరేకంగా పోరాడారు. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా తన కుల గుర్తింపును విడిచి పెట్టేశారు. జీవించే ప్రతి జీవం సమానమేనని భావించారు. దీన్ని చూపించేందుకు ఒక యువ దళితునికి ఉపనయనం చేసి బ్రాహ్మణుని చేశారు. అప్పట్లో తర్వాతి తరాల వారి మనస్సులోకి పెద్దలు విభజన బీజాలు నాటడాన్ని వెక్కిరించారు. వేదాలను, గీతను బోధించేప్పుడు తమ స్వంత ఆలోచనలు దానిలో చేర్చి కువ్యాఖ్యానాలు చేయడాన్ని బహిరంగంగా ఖండించారు. దళితులను హిందూ ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావడానికి ఆయన గట్టిగా మద్దతిచ్చారు.

తమిళనాట సుబ్రహ్మణ్య భారతి భావాత్మక విప్లవాన్ని సాధించారు. సంస్కరణ, దేశభక్తి, జాతీయ వాదం, తమిళ భాష ఔన్నత్యం వంటి అంశాల్లో ఆయన కవితలు తమిళులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. సామాన్యమైన ప్రజలు ఆయన కవితలను కంఠస్థం చేసి సందర్భానుసారం ప్రస్తావించే స్థాయికి వచ్చాయి. కోట్లాదిమంది ప్రజలు ఆయన రాసిన కవితల పంక్తులను ప్రస్తావించడం విశేషం. ప్రేమ, భక్తి, కరుణ, శాంతి, యుద్ధం వంటి సార్వజనీనమైన అంశాల్లోనూ భారతి గీతాలు సందర్భానుసారంగా ప్రజల నాలుకలపై నర్తించాయి.

భారత ప్రభుత్వం, మానవ వనరుల అభివృద్ధి శాఖతో కలిసి 1987లో అత్యున్నత జాతీయ స్థాయి సుబ్రహ్మణ్య భారతి పురస్కారాన్ని నెలకొల్పి ప్రతి సంవత్సరం హిందూ సాహిత్యంపై అత్యున్నత స్థాయి రచనలు చేసిన రచయితలను సత్కరిస్తోంది. భారతీయార్ విశ్వవిద్యాలయాన్ని ఆయన పేరిట 1982లో కోయంబత్తూరులో నెలకొల్పారు. మెరీనా బీచ్ వద్ద, భారత పార్లమెంటు భవనం వద్ద భారతీయార్ విగ్రహాన్ని నెల కొల్పారు. కోయంబత్తూరు లోని భారతీయార్ రోడ్డు, న్యూఢిల్లీ లోని సుబ్రమణియం భారతి మార్గ్,ఇలా ఎన్నో రోడ్లుకు ఆయన పేరు పెట్టారు. కర్ణాటక సంగీత రంగంలో తరచుగా వినవచ్చే కృతుల్లో సుబ్రహ్మణ్య భారతి కీర్తనలు ఉన్నాయి. ఆయన రచించిన పలు కీర్తనలను పలువురు కర్ణాటక సంగీత విద్వాంసులు కచేరీల్లోనూ, రికార్డుల్లోనూ గానం చేశారు.1921 సెప్టెంబరు 12లో అర్ధరాత్రి ఆయన మరణించారు.

**కవిత్వంలో ప్రగతి శీలమైన, సంస్కరణాత్మకమైన ఆదర్శాన్ని వ్యక్తీకరించిన కవి సుబ్రహ్మణ్య భారతి. ఆధునిక తమిళ సాహిత్యానికి ఆయనను మార్గదర్శకునిగా భావిస్తారు. ప్రాచీన, సమకాలీన అంశాల మేలు కలయికగా నిలిచే కవిత్వ శైలి ఆయన సొంతం. ఆధునిక తమిళ సాహిత్యంలో ఆయన ఆలోచన, ఊహ, పద్యంలోని పటుత్వం కొత్తపుంతలు తొక్కాయి. వేలాది కవితలు... భారత జాతీయ గీతాలు, ప్రణయ గీతాలు, బాలల కవితలు, ప్రకృతి గీతాలు, తమిళ భాష గొప్పతనాన్ని ఉగ్గడించే కవితలు, భారత స్వాతంత్ర్య పోరాట ప్రముఖులైన తిలక్, గాంధీ, లజపతిరాయ్ వంటివారిని ప్రస్తుతించే కవితలు వంటి విస్తారమైన, విభిన్నమైన అంశాలను స్వీకరించి అద్భుతమైన రీతిలో రాశారు. శక్తి, కాళి, వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు, శివుడు, కృష్ణుడు వంటి వారినే కాక ఇతర మతదేవతలైన అల్లా, ఏసు వంటివారిని కూడా ప్రస్తుతించారు. జాతీయ, సంస్కరణ నాయకులైన అరబిందో, బాలగంగాధర తిలక్, స్వామి వివేకానంద వంటివారి ప్రసంగాలను అనువదించారు.**



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# మిషన్ భగీరథ అధికారులతో సమావేశం

**మునుగోడు నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలి**

**మోటార్ల కెపాసిటీ పెంచడానికి ప్రపోజల్స్ రెడీ చేయండి**



**విశ్వంభర,మునుగోడు నియోజక వర్గం:** నియోజకవర్గ వ్యాప్తంగా మిషన్ భగీరథ గ్రిడ్ పనుల తీరు పై అధికారులతో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. లింగోటం నీటి శుద్ధి కేంద్రం నుండి మునుగోడు నియోజకవర్గానికి జరిగే నీటి సరఫరా ఎలా ఉంది? ఎంతవరకు సరిపోతుంది.? ఇంకా ఎంత అవసరం ఉందనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మిషన్ భగీరథ తాగునీటి కేటాయింపులు జరగలేదని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి కేటాయింపులు పెంచాలన్నారు... దీనికోసం మోటార్ల కెపాసిటీ పెంచాల్సి ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి అధికారులు తీసుకురాగా వెంటనే మోటార్ల కెపాసిటీ పెంచడానికి కావలసిన ప్రపోజల్స్ పంపించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే కాలంలో మునుగోడు నియోజకవర్గంలోని చండూరు చౌటుప్పల్ మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, భవిష్యత్తు జనాభాను దృష్టిలో ఉంచుకొని తాగునీటి కేటాయింపులు జరగాలని కోరారు. వచ్చేవేసవి వరకు నియోజక వర్గంలో తాగునీటి కొరత లేకుండా మిషన్భగీరథద్వారా ప్రతి ఇంటికి నీటిని అందించాలన్నారు.

## టేకు దుంగతో గణపతి విగ్రహం చెక్కిన సున్నం బ్రహ్మయ్య

**ఆకర్షిస్తున్న కర్ర గణపతిని చూడడానికి బారులు తీరిన ప్రజలు**




**విశ్వంభర, మెట్ పల్లి :** మెట్ పల్లి పట్టణంలోని చైతన్య నగర్ లో గల మనసు వుడ్ ఫర్నిచర్ వర్క్స్ ప్రోపరేటర్ సున్నం బ్రహ్మయ్య అనే వడ్రంగి ఒకే ఒక టేకు దుంగతో ఎలాంటి అతుకులు జాయింట్స్ లేకుండా సహజ సిద్ధంగా ప్రతిమను తయారుచేసి వినాయక నవరాత్రులలో భక్తులకు దర్శనార్థం ఏర్పాటు చేశారు. సున్నం బ్రహ్మయ్య మాట్లాడుతూ మహారాష్ట్రలో గల కర్ర గణపతి (పాలాజీ గణపతి)ని చూసి 14 సంవత్సరాల క్రితం టేకు కర్రతో గణపతిని తయారు చేశానని, ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రులలో పూజలు నిర్వహిస్తామని మెట్ పల్లి గ్రామ ప్రజలే కాక ఇతర గ్రామాల నుండి భక్తులు వస్తారని చెప్పారు. నవరాత్రుల అనంతరం ప్రత్యేక గదిలో భద్ర పరుస్తామని చెప్పారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, కామారెడ్డి :** నియోజకవర్గ పరిధిలోనీ మాచారెడ్డి మండలంలోనీ గజ్యానాయక్ తండాలో నేడు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కామారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు విపుల్ జైన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో, తండాలో ఇంటింటికీ వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి బూత్ స్థాయిలో బీజేపీ మద్దతుదారులను కలవాలని అన్నారు. సభ్యత్వ నమోదు కోసం 8800002024 కి ఫోన్ చేసి బీజేపీ సభ్యత్వం తీసుకోలని విజ్ఞప్తి చేశారు. సభ్యత్వ నమోదులో కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో మాచారెడ్డి మండలం మొదటి స్థానంలో ఉండాలని సూచించారు.

## గోదావరి వరదల సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల



**విశ్వంభర, భద్రాచలం :** గోదావరి వరదల సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. వరదల పై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండుసార్లు గోదావరి వరదలు ఉదృతంగా వచ్చినా,ఒక్క చుక్క వరద నీరు పట్టణంలోకి రాకుండా కట్టుదిట్టం చేశామని తెలిపారు. పవిత్ర పుణ్య క్షేత్రం, భద్రాచలాన్ని అందంగా, ఆరోగ్యంగా, భక్తులందరూ కొనియాడేలా భద్రాచలాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్పీ ఇతర అధికారుల పనితీరు అభినందనీయం అని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరదల వలన జరిగిన నష్టాన్ని అన్నివిధాలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదుకుంటున్నారని తెలిపారు. గతంలో గోదావరి వరదల కారణంగా పరీవాహక ప్రాంతంలో ఆస్తినష్టం ప్రాణ నష్టం భారీగా జరిగాయి. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో అలాంటి ఘటనలు చోటు చేసుకో కుండా ముందస్తు ప్రణాలికలు రూపొందించి ఎక్కడా ఎటువంటి నష్టం జరగకుండా చూస్తున్న ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వం దేనాని మంత్రి తుమ్మల స్పష్టం చేసారు.

## గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీలు



**విశ్వంభర, మెట్ పల్లి :** మెట్ పల్లి మండలం పెద్దపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆకస్మిక తనిఖీ చేశారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాల పరిసరాలు,తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులు హాజరు వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల కాలం అయినందున పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాజా మాజీ ఎంపీపీ మారుసాయిరెడ్డి పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ మరియు బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరైన యాదవ హక్కుల అధ్యక్షుడు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని గవర్నమెంట్ హాస్టల్లో వైష్ణవి, భవ్య యాదవ్ ఉరిబెట్టుకొని చనిపోయినప్పుడు జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ ఆధ్వర్యంలో భువనగిరి హైవేను దిగ్బంధం చేసిన ఘటనలో మేకల రాములు యాదవ్ పై కేసు నమోదు చేయడం జరిగింది. అదే కేసు విషయంలో భువనగిరి కోర్టుకు బుధవారం హాజరయ్యారు. మోడీ రాందేవ్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి భాషాబోయిన నవీన్ యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షుడు భాషబోయిన ప్రదీప్ యాదవ్, పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి సాయం



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన పులమోని గాలయ్య ఇటివల మరణించగా అతని దశదినకర్మ కార్యక్రమానికి అవసరమగు బియ్యం , ఇతర సరుకులను బుధవారం బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ భిక్షం ఆధ్వర్యంలో గాలయ్య కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. కష్టకాలంలో మా కుటుంబానికి అండగా నిలిచినందుకు గాలయ్య కుటుంబ సభ్యులు కర్నె ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వడ్డెపెల్లి రాములు సాగర్,ఉప్పల శ్రీనివాసులు,చిలువేరు బుగ్గరాములు,గుండమల్ల సతీష్ కుమార్,ఎరోళ్ళ లింగస్వామి,ఎడ్ల సత్తయ్య,శికిలమెట్ల ప్రభాకర్, మందుగుల సాయికిరణ్,చింతకింది ఉషమ్మ, చిలువేరు యాదయ్య, గ్రామస్థులు భూపాని బలరాం, ఉపరమోని యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానం, గ్రంథాలయం, ఏర్పాటు చేయాలి



**విశ్వంభర భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాటారం డివిజన్ పరిధిలో క్రీడా మైదానం, గ్రంథాల యం ఏర్పాటు చేయాలని, క్రీడాకారులకు ఉచితంగా క్రీడా కిట్లు ఇవ్వాలని, అలాగే పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని డిప్యూటీ కలెక్టర్ కు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్మూరి శ్రీకాంత్ వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్మూరి శ్రీకాంత్ మాట్లాడుతూ క్రీడలకు సంబంధించి కాటారం డివిజన్ పరిధిలో క్రీడాకారులు ఆటలు ఆడేందుకు క్రీడా మైదానాలు ఏర్పాటు తోపాటు, విద్యార్థులకు, విద్యావంతులకు, గ్రంథాలయము ఏర్పాటు చేయాలన్నారు. దీంతోపాటు కాటారం డివిజన్ పరిధిలో నివాసాలకు ఆనుకొని ఉన్న వైన్ షాపును నివాసాలకు దూరంగా 200 మీటర్ల పరిధిలో ఏర్పాటు చేయాలన్నారు. కాటారం మండల పరిధిలోని ప్రజల కు సురక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరణ్, అఖిల్,తదితరులు పాల్గొన్నారు.

## పల్లెర్ల పాఠశాలకు పుస్తకాల బహుకరణ



**విశ్వంభర, యాదాద్రి భువనగిరి జిల్లా :** ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన కీ.శే.గుర్రం కమలమ్మ ,వెంకటయ్యల జ్ఞాపకార్థం వారి మనవడు గుర్రం సంపత్ (రైల్వే ఉద్యోగి) పాఠశాల లైబ్రరీకి సుమారుగా 60 రకాల కథల పుస్తకాలు బహుకరించారు. అదేవిధంగా పుస్తకాల కోసం అల్మరాకు 5000 రూపాయల నగదు అందజేశారు . విద్యార్థులు క్రమశిక్షణతో చక్కగా చదువుకోవాలని అభిలాషించారు. విద్యార్థుల అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. గుర్రం సంపత్ ని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పల్లె శంకర్ శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ కుమార్ రెడ్డి, త్యాగరాజా చారి, పి. శేఖర్ ,జే .రవీందర్ పాల్గొన్నారు.

## గోదావరి ఉధృతిని పరిశీలించిన మంత్రి తుమ్మల



**విశ్వంభర, భద్రాచలం :** భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్న గోదావరి ఉధృతిని నూతన బ్రిడ్జి మీద నడుచుకుంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. అనంతరం విస్తా కాంప్లెక్స్ వద్ద మురుగునీరు బయటకు తోడే ప్రక్రియను, గోదావరి కరకట్ట వద్ద వరద ఉధృతిని కొత్త కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఇరిగేషన్, పంచాయతీ, ఆర్ అండ్ బీ, అగ్రికల్చర్, విద్యుత్, వైద్య అన్ని శాఖల అధికారులను వరదల సమయంలో ఎలా స్పందిస్తున్నారు అని అడిగి సమీక్షించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు పడిపోయిన, రోడ్లు పాడైనవెంటనే పనులుచేయాలని ఆదేశించారు. గోదావరి వరద 50 అడుగులు దాటి ప్రవహిస్తున్నందున ఎప్పటికప్పుడు వరద ఉధృతిని తెలియ చేయాలని అన్నారు.

## జిల్లా అధ్యక్షుడిగా తేలుకుంట్ల చంద్రశేఖర్



**విశ్వంభర, చండూరు:** నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా చండూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన న్యాయవాది, ప్రముఖ వ్యాపారవేత్త తేలుకుంట్ల చంద్ర శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునికి ఎన్నికకు చండూరు రెవెన్యూ పట్టణానికి చెందిన తేలుకుంట్ల చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్య వైశ్య మహాసభ ఎన్నికల అధికారి ఇరుకుల్ల రామకృష్ణ ప్రకటించారు. చంద్ర శేఖర్ పలువురు సన్మానించి అభినందనలు తెలిపారు. దేవరకొండ మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నరసింహ, పానగంటి మల్లయ్య, ఇరుకుల్ల రామకృష్ణ, మాజి జిల్లా అధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు, చండూరు, నాంపల్లి, మునుగోడు, గట్టుప్పల్, మర్రిగూడ మండలాల వైశ్య సభ్యులు తేలుకుంట్ల జానయ్య, సముద్రాల వెంకన్న, మంచుకొండ సంజయ్, కర్నాటి శ్రీనివాస్, సోమ నర్సింహా, గట్టు రాజశేఖర్, తాడిశెట్టి సంతోష్, సాగర్, తడకమల్ల శ్రీధర్, మిర్యాల శ్రీను, బిక్కుమాళ్ల విశ్వరాథం, ఆనంద్, నాగరాజు, సురేష్, భూపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు కోలాట కోలలు పంపిణీ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని అంగడి వద్ద హనుమాన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలకు పద్మావతి డయాగ్నోస్టిక్ సెంటర్ యజమాని మస్కు లత నరేందర్ దంపతులు కోలాట కోలలు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా మస్కు నరేందర్ మాట్లాడుతూ మా నాన్న కీర్తి శేషులు మస్కు పోషయ్య జ్ఞాపకార్థం కోలాట కోలలు మహిళలకు పంపిణీ చేశామని అన్నారు . విగ్నేశ్వరుని ఆశీస్సులు అందరి మీద ఉండాలని కోరుకుంటున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## మా గల్లీలో మట్టి గణపతి



**విశ్వంభర,నారాయణపూర్:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ కాలనీలో పర్యావరణాన్ని పరిరక్షించాలనే భావనతో గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి యేటా ఇక్కడ మట్టి వినాయకున్ని ప్రతిష్టిస్తున్నారు. రంగులు, రసాయనాలతో తయారుచేసిన వినాయక ప్రతిమలతో జల కాలుష్యం జరుగుతుంది. గణేష్ వేడుకల్లో మట్టి ప్రతిమలను పూజించాలనే భావనతో ముత్యలమ్మ కాలనీ వాసులంతా సమిష్టి నిర్ణయంతో మట్టి గణపతి పూజిస్తూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ముత్యాలమ్మ కాలనీ వాసులు.



విశ్వంభర,చండూర్మున్సిపాలిటీ: నేతాజీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు

# గైర్హాజరైన జిల్లా అధికారులపై చర్యలు





**విశ్వంభర, భూపాలపల్లి :** కలెక్టర్, శాసనసభ్యుడు చెప్పినా పనులు చేయకపోతే మున్సిపల్ కమిషనర్ ఎందుకు ఉన్నట్లు అని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మున్సిపల్ కమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్. కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ సిగ్గెం వెంకటరాణి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు మాట్లాడుతూ ప్రభుత్వ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సీఎస్ఆర్ నిధులు ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగించాలని, కార్మికుల నివాస గృహాలకు నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని అన్నారు. సింగరేణి సంస్థ గనులు ఏర్పాటులో ప్రజాభిప్రాయ సేకరణలో ఆ ప్రాంత అభివృద్ధి భాధ్యత మేము తీసుకుంటామని చెప్పారని, ఇపుడు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇచ్చిన మాటలు నీటి మూటలు అయ్యాయని, అభివృద్ధిని విస్మరించారని అన్నారు. సింగరేణి పరిధిలో నున్న వార్డుల్లో వ్యర్థాలు తొలగించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జి.ఎం సర్వసభ్య సమావేశానికి ఎందుకు రాలేదని, వాళ్లు రాని సమావేశం నిర్వహించడం దండగేనని, మున్సిపల్, సింగరేణి ఒకరి మీద ఒకరు పెట్టుకుని నాలుగున్నర సంవత్సరాలు నుండి వ్యర్థాలు తీసిన పాపాన లేదని, నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కూలిన ఇండ్ల బాధితులకు చెక్కుల పంపిణ



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ మండల కేంద్రంలో ఇటీవల భారీ వర్షాలకు పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్ల బాధితులకు తాసిల్దార్ కార్యాలయంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోకుండా కురిసిన భారీ వర్షాలతో నియోజకవర్గంలో పాత ఇండ్లు కూలిపోయాయని అలాంటి వారిని గుర్తించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటుందని అంతేకాకుండా వాగులు చెరువులు నిండి అలుగు పోస్తున్నాయని దీంతో పలుచోట్ల అండర్ పాస్ బ్రిడ్జిలు కల్వర్టులు దెబ్బతిన్నాయని వీటన్నిటికీ మరమ్మత్తులు చేయించి బాగుపరుస్తామని అన్నారు. కార్యక్రమంలో పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల అధ్యక్షుడు జగన్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, మైసయ్య, ఐఎన్టిఈసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, గాజుల శీను, శివలింగం, తల్లోజు రామకృష్ణ, కృష్ణ నాయక్, శ్రీశైలం, బాబా, విజయ్ రాథోడ్, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 18 సం.రాలు నిండిన వారు ఓటు నమోదు



**విశ్వంభర భూపాలపల్లి:** జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎన్నికల సంగం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టినందున నూతన ఓటరు నమోదు, చిరునామా మార్పు, పోలింగ్ కేంద్రం మార్పుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో బూతు స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్భహించి అర్హులైన ప్రతిఒక్కరిని నూతనఓటరుగా నమోదు చేస్తారని తెలిపారు.

## సరైన పోషణ ఆరోగ్య తెలంగాణనే లక్ష్యం



**విశ్వంభర, భూపాలపల్లి :** సరైన పోషణ ఆరోగ్య తెలంగాణనే లక్ష్యంగా పోషణ మాసోత్సవాల ను నిర్వహిస్తున్నామని ప్రీ స్కూల్ ట్రైనింగ్ సి డి పి ఓ అవంతి అన్నారు. బుధవారం పర్లపల్లి అంగన్వాడీ సెక్టార్ పరిధిలోని పర్లపల్లి-1 అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహార పదార్థాల ప్రదర్శనను నిర్వహించి వాటి విలువల పై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఎదుగుదల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తూ రక్తహీనత ,తక్కువ బరువును అరికట్టేందుకు పెద్ద ఎత్తున పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే మొగుళ్ళపల్లి మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన అంగన్వాడి సెక్టార్ సూపర్వైజర్ మాధవి గర్భిణీ స్త్రీలు, బాలింతల ను ఉద్దేశించి మాట్లాడారు ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత, హెల్త్ సూపర్వైజర్ జమున, స్కూల్ టీచర్స్, ఆశాలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలు, సెక్టార్ అంగన్వాడీ టీచర్లు మరియు ఆయాలు పాల్గొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజీ లో ప్రవాహపు అంచనా పరీక్షలు



**విశ్వంభర,భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు లోని కీలకమైన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ లో శాస్త్రవేత్తలు ప్రవాహపు అంచనా పరీక్షలు ప్రారంభించారు. ఎన్సీడబ్ల్యూఎస్ఏ సూచనల మేరకు సిడబ్ల్యుపిఆర్ఎస్ పుణేకు చెందిన శాస్త్రవేత్తలు సంపత్, నాగరాజు ఆధ్వర్యంలో ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫెల్లర్) పరికరం బోటుకు అమర్చి పరీక్షలను నిర్వహిస్తున్నారు. బ్యారేజ్ లో 3.62 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో నాటు పడవలు కాకుండా లక్నవరం నుంచి ప్రత్యేకంగా బోటును మంగళవారం తీసుకొచ్చారు. ఆ బోటుకు ఏడీసీపీ పరికరం అమర్చి ప్రవాహం అంచనా వేస్తున్నారు. కాగా ఇదే బృందం సభ్యులు గతం లో అన్నారం సరస్వతీ బ్యారేజ్ లోనూ పరీక్షలు చేపట్టారు.

## వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్



**విశ్వంభర, మహబూబ్‌బాద్:** మహబూబాబాద్ మండల కేంద్రంలోని ఉమ్మడి గ్రామపంచాయతీ అయినటువంటి మల్యాల గ్రామంలోని పలు, చౌక్ల తండా, మిగ్య తండా,తండాలను మహబూబాబాద్ శాసనసభ్యులు డా. భూక్య మురళి నాయక్ విస్తృతంగా పర్యటించారు . భారీ వర్షాల వల్ల వరద ప్రవాహానికి కొట్టుకపోయినటువంటి రైతుల పొలాలను, ఇళ్లను తెగిపోయినటువంటి చెరువు కట్టలను వాగులను క్షుణ్ణంగా పర్యవేక్షించారు, ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ తక్షణమే చర్యలు చేపట్టాలని ఈ యొక్క మల్యాల ఉమ్మడి గ్రామపంచాయతీలో తండాలలో అధికంగా వర్షాల వల్ల వర్గ ప్రవాహానికి భారీగా ఇల్లు కూలిపోయి నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డాయని తక్షణమే వారిని ఆదుకోవాలని అన్నారు. ఈ భారీ వర్షాల వల్ల ఇల్లు కూలిపోయినటువంటి ప్రజలకు వెంటనే ఇందిరమ్మ ఇల్లులను తర్వాగతిలోనే మంజూరు చేపించి వారికి ఐదు లక్షలతో కట్టిస్తామని భరోసానిచ్చారు. ఎవ్వరు అధైర్యపడవద్దని అందరికీ అండగా ఉంటానని, నష్టపోయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరపున తక్షణమే నష్టపరిహారాన్ని చెల్లిస్తామన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో మహబూబాబాద్ మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు వివిధ తండాల గ్రామ పార్టీ నాయకులు యూత్ నాయకులు జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పార్టీ శ్రేయోభిలాషులు బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## సారా తయారీ చేసిన అమ్మిన కఠిన చర్యలు



**విశ్వంభర, మహబూబ్ బాద్:** మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఇల్లందు రోడ్డు, రైల్వే స్టేషన్, కొరవి గేటు, సలార్ తండా ఏరియాలలో మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, ఎన్ఫోర్స్మెంట్ వరంగల్ సిబ్బంది ,డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ మహబూబాబాద్ సిబ్బంది సంయుక్తంగా రూట్ వాచ్ / వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇట్టి తనిఖీల్లో ఆంధ్రప్రదేశ్లోని రాజమండ్రి నుండి నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామానికి సారాయి తయారీకి కావలసిన నల్లబెల్లం మరియు పటిక తన CARద్వారా రవాణా చేస్తున్నటువంటి ఆలేరు గ్రామానికి చెందిన గుగులోతు సైదులు , ట్రైన్ ద్వారా బెల్లం తీసుకువచ్చి కురవి మండలంలోని ఇస్లావత్ తండాకు బైక్ ద్వారా రవాణా చేస్తున్నటువంటి ఇస్లావత్ నవీన్ లను అదుపు లోకి తీసుకొని కేసులు నమోదు చేసారు.

## శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాస కార్యక్రమం




**విశ్వంభర, జగిత్యాల :** జగిత్యాల జిల్లాలోని "మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో " మెట్ పల్లి పట్టణం, విదిత్ రెడ్డి గార్డెన్ లో పోషణ మాస కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బి .నరేష్ హాజరయ్యారు. జిల్లా సంక్షేమ అధికారి నరేష్ మాట్లాడుతూ ముఖ్యంగా 5 సంవత్సరాల పిల్లల్లో లోప పోషణను, రక్త హీనతను, గర్భిణీలు, బాలింతలలో రక్త హీనతను నివారించి ,పిల్లల్లో పోషణ స్థాయిని పెంపొందించడనికి ప్రభుత్వము నిర్ధిష్టమైన లక్ష్యాలతో పని చేయడం జరుగుతుందని అన్నారు. పిల్లల్లో లోప పోషణను, నివారించడానికి పోషణ మాసం అనే ఈ ప్రత్యేక కార్యక్రమము ద్వారా గ్రామ స్థాయిలో,మండల స్థాయిలో ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలందరికీ అవగహన కలిపించటం జరుగుతుందని చెప్పారు. పోషణ, పాడాయి అనే కార్యక్రమము ద్వారా పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యతో పాటు, పౌష్టికాహారం అందచేయడం జరుగుతుందని అన్నారు, మండల అధికారి మహేశ్వర్,మండల ప్రజా పరిషత్ అధికారి రామకృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బి.నరేష్,సిడిపివో మణెమ్మ, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధు కుమార్, ఐసిడియస్ సూపర్ వైజర్లు,పోషణ అభియాన్ సిబ్బంది,అంగన్ వాడి టీచర్లు, పట్టణ ప్రజలు, పాల్గొన్నారు.

## రాజన్నబోలిలో నెమలి పించాలతో గణపతి



**విశ్వంభర, రాజన్నబోలి:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ చంద్రాయణ గుట్ట నియోజకవర్గంలోని శివాజీ నగర్ రాజన్నబోలి జిహెచ్ఎంసి ప్లేగ్రౌండ్ లో గత 26 సంవత్సరాల నుండి వినాయకుని నెలకొల్పుతున్నారు. ఆర్కే ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40 మంది మిత్రులు కలిసి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2018 సంవత్సరంలో డ్రై ఫ్రూట్ గణేష్, 2019లో అగ్గిపుల్లల గణేష్ 2020లో ముత్యాల గణేష్, 2021 లో చాక్లెట్ గణేష్ , 2022లో కుందన్ గణేష్ , 2023లో పాస్తా గణేష్ ప్రస్తుతం 2024లో నెమలీకలతో కూడిన గణేష్ ప్రతిమను నెలకొల్పారు. ఈ సందర్భంగా బి శ్రీకాంత్ గౌడ్ మాట్లా డుతూ అందరి ప్రోత్సాహం వల్ల మేము ఇంత ఘనత సాధిస్తున్నామని ఇలాగే ప్రతి సంవత్సరం అందరి సహకారంతో ఏరాప్టలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కే రవికాంత్ గౌడ్, సిహెచ్ అనిల్ కుమార్, జి నవీన్ కుమార్, పాల్గొన్నారు.

## కాళేశ్వరాలయంలో గణపతి హెూమం



**విశ్వంభర భూపాలపల్లి:** వినాయక నవరాత్రులలో భాగంగా భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం లో ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు గణపతి హెూమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ప్రసాదశాలలో వినాయక నవరాత్రులు పురస్కరించుకొని ఆలయ అధికారులు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి ఏ. మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ ధర్మకర్తలు, ప్రజా ప్రతినిధులు, కాలేశ్వరం గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## రాజమణి కుటుంబానికి పరామర్శ



**విశ్వంభర, మహబూబాబాద్ :** కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామానికి చెందిన కెంచ మొగిలి భార్య కేంచ రాజమణి ఇటీవల బైక్ పై నుండి జారిపడి మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి వారి కుమారులు రాధాకృష్ణ, సూర్యకుమార్ లను సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపి వారి కుటుంబానికి సమ్మయ్య గౌడ్ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా కల్పించారు. వీరితోపాటు సమ్మి గౌడ్ ఫౌండేషన్ సభ్యులు ఎర్రం శెట్టి అశోక్, చిలువేరు సాయి గౌడ్, పబ్బతి ప్రశాంత్ గౌడ్, చాగంటి రాము, గంధసిరి సోమన్న, మోడం రాజు,షేక్ జానీ, మహమ్మద్ సైదులు, చిట్టె కుమార్, కందల శ్రీకాంత్,రఫీ,సింగని వేణు తదితరులు ఉన్నారు.

## పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దండి



**విశ్వంభర, ఆమనగల్లు :** మండల విద్యాధికారి వి.సర్దార్ నాయక్ పోలేపల్లి గ్రామంలో పర్యటించారు. ప్రాథమికోన్నత పాఠశాల లో ఉదయం ప్రార్థనకు హాజరయ్యారు. అనంతరం పాఠశాలలో FLN అమలు తీరును పరిశీలించారు అనంతరం కేజీబీవీ ఆమన్ గల్‌ను సందర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు) ప్రధానోపాధ్యాయులు పాండు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ( బాలికలు) ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి తో కలిసి క్లాస్ రూమ్ లో "ఎఫ్ ఎల్ ఎన్ "అమలవుతున్న తీరును పరిశీలించారు. స్టాక్ రూమ్, వంటశాలను ,వంట సామాగ్రిని , వంటల్లో పాటించవలసిన నిబంధనలను, మెనూ, హాజరు పట్టికను పరిశీలించి ఉపాధ్యాయులు ,వంట సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాఠశాల నిర్వహణ తీరును పరిస్థితులను తెలియపరచి మండలంలో కేజీబీవీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు

## దోమలు ప్రబలకుండా చూసుకోండి: డిఎంహెచ్ఓ




**విశ్వంభర, మహబూబ్ బాద్:** బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ మరియు కీటక జనిత ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడున్న రోగులకు సీజనల్ వ్యాధులు మీద అవగాహన కల్పిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిస రాల పరిశుభ్రత పాటిస్తూ, అంటూ వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. అలాగే వరద ముంపు ప్రాంతాలు సీతారాం తండా, బాలిని ధర్మారం మెడికల్ క్యాంపులను సందర్శి ంచి అక్కడున్న సిబ్బందికి ప్రతి ఇంటిని సందర్శించి జ్వర సర్వే చేస్తూ, ఎవరికైనా జ్వరము ఉన్నట్లయితే మలేరియా మరియు డెంగ్యూ ఆర్‌డిటి కిట్లతో రక్తపరీక్ష చేసి మందులు ఇవ్వాలని, ఈ ప్రాంతాలలో దోమలు ప్రబలకుండా, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా, రాకుండా తీమోపాస్, పైరిత్రం స్ప్రే, త్రాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలని సూచనలు ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా ప్రతి మండలానికి ఐదు లీటర్ల మలాథిన్, ఐదు లీటర్ల థీమోపాస్ పంపిణీ చేయాలని అన్నారు. మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవి, జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ ఒబిలిశెట్టి రామకృష్ణ, ఎం ఎల్ హెచ్ పి అఖిల, సిస్టర్ రాములమ్మ , ఆశలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస ఉత్సవాలు

**విశ్వంభర, భూపాలపల్లి :** ఒడితల అంగన్వాడీ కేంద్రం , వివేకానంద స్కూల్లో పోషణ మాస ఉత్సవాలు జరిగాయి. అంగన్వాడి సూపర్వైజర్ జయప్రద హాజరై నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగడానికి తీసుకోవలసిన సమతుల ఆహారం, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ,చదువు యొక్క ప్రాముఖ్యత, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గూర్చి వివరించారు. సమతుల ఆహారం భుజించకపోతే పిల్లలలో మెదడు చురుకుగా పనిచేయకపోవడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, నాడీ వ్యవస్థ పని చేయకపోవడం ,అధిక బరువు పెరగడం, ఊబకాయం, కండరాలు ఎముకలు దృఢంగా లేకపోవడం జరుగుతాయని అన్నారు. 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల బాలబాలికలు తప్పనిసరి ప్రతిరోజు తినే భోజనంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు,పాలు పండ్లతో భోజనం చేసినట్లయితే పోషకాహార లోపాన్ని రక్తహీనతను తగ్గించవచ్చని ముందు ముందు అనుకున్న లక్ష్యం చేరుకుంటారని వివరించారు. ఆరోగ్య శాఖ అధికారి సంజీవ రెడ్డి మాట్లాడుతూ పిల్లలందరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఆరోగ్య పరీక్షలు కనీసం ఆరు నెలలకు ఒకసారి అయినా చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. వివేకానంద ప్రిన్సిపాల్ సతీష్ ,హెచ్ఎం మహేందర్ , సంజీవరెడ్డి, అంగన్వాడి టీచర్స్ లక్ష్మీ, ఉమాదేవి, మంగ ,ఆయా భద్రమ్మ, తల్లులు, పిల్లలు హాజరయ్యారు.



## కేటీఆర్ సేన సోషల్ మీడియా అధ్యక్షులుగా శ్రీకాంత్




**విశ్వంభర, భూపాలపల్లి :** కేటీఆర్ సేన సోషల్ మీడియా భూపాలపల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా మొగుళ్ళపల్లి మండలంలోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన జన్నె శ్రీకాంత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగాని మనోహర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు వీసం భరత్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు పిన్నింటి మణిదీప్ రావు, జన్నె శ్రీకాంత్ కు నియామక పత్రాన్ని అందజేశారు.

## జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

**విశ్వంభర,అంబర్ పేట్:** అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను బుధవారం వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. అంబర్‌పేట నియో జకవర్గంలోని ఐదు డివి జన్లలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి 11 కోట్ల మేర సిద్ధం చేసిన ప్రతిపాదనలను వారికి అందజేసి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు చెపడుతామని హామీ ఇచ్చారు.



## పోతుగల్లు రోడ్లన్నీ మురికి కూపాలు



**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని పోతుగల్లు గ్రామంలోని రోడ్లన్నీ మురికి కూపాలుగా మారాయి. దీంతో గ్రామంలోని రోడ్లన్నీ ఈగలకు, దోమలకు ఆవాసాలుగా..దుర్వాసన వెదజల్లె కేంద్రాలుగా మారి ప్రజలు డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాలకు గురవుతున్నారు. డ్రైనేజీ మురుగునీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో డ్రైనేజీ నిండి చెత్తాచెదారంతో పేరుకుపోవడంతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. డ్రైనేజీలోని మురుగునీరు బయటికి రావడంతో ఈగలు, దోమలు దుర్వాసనతో ప్రజలు విష జ్వరాల భారీన పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మురుగునీటితో నిండి ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేయించి రోడ్లన్నీ బురదమయం కాకుండా చూడాలని పోతుగల్లు గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తా



**విశ్వంభర, భూపాలపల్లి :** రానున్న రోజుల్లో భూపాలపల్లి మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుందూరుపల్లి, భాస్కరగడ్డ లో టీయూఎఫ్ఐడీసీ నిధుల నుండి రూ.1 కోటి రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. పట్టణవాసుల దాహార్తి తీర్చేందుకు ఇటీవల అమృత్ పథకం 2.0 ద్వారా రూ.18.99 కోట్లతో ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల నిర్మాణం ఇదివరకే చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ గా ప్రముఖ న్యాయవాది

**విశ్వంభర, ఎల్బీనగర్:** హైకోర్టు ప్రముఖ న్యాయవాది నూనె ప్రభాకర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ , హ్యూమన్ రైట్స్, సమాచార హక్కుకన్వీనర్‌గా నియమితులయ్యారు. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి ఆయన చేస్తున్న సేవలు గుర్తింపునిస్తూ ఆ పదవి బాధ్యతలను అప్పగించినట్లు చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు. బుధవారం అశోక్ గౌడ్ చేతుల మీదుగా నూనె ప్రభాకర్ నియామక పత్రాన్ని అందుకున్నాడు. ప్రభాకర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సోనియ గాంధీ, రాహూల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గె, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో పాటు పార్టీ పెద్దలందరికి నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.



## ఏకదంతుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో మహా గణపతి 37వ నవరాత్రి మహోత్సవాల లో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వాటర్ వర్క్స్ డిజిఎం రవీంద్ర నాథ్ వర్మ, వాటర్ వర్క్స్ ఏ ఈ రామ కృష్ణ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య, అష్టలక్ష్మి దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ సుధాకర్ గుప్తా, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు బంధం దామోదర్, గౌరిశెట్టి అరుణ్, కమిటీ సభ్యులు గౌరీ శంకర్, వనమా సుదర్శన్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గ్రంధి రమేష్, గందే శ్రీకాంత్, డా!!. రాంకిషన్, శుభకర్, కృష్ణ మూర్తి, చందు, రాజేంద్ర ప్రసాద్, సుబ్బారావు, మేఘమాల, సుజాత, లక్ష్మీ, భ్రమరాంబా, లావణ్య, అరుణ, వనజ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలి



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఉన్నత – వృత్తి విద్యా కోర్సులను బీసీలను ప్రోత్సహించడానికి గత నాలుగు సంవత్సరాలుగా పేరుకుపోయిన 4వేల కోట్ల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర బీసీ యువజన సంఘం డిమాండ్ చేసింది. బుధవారం రాష్ట్ర బీసీ యువజన సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. సమావేశం తీర్మానాలు ఏకగ్రీవంగా చేశారు.కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పెంచాలి. విద్యా, ఉద్యోగ రంగాలలో జనాభా ప్రకారం 52శాతం బీసీ రిజర్వేషన్లు పెంచాలి.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి.బీసీలకు అన్యాయం జరుగుతున్న రోష్టర్ పాయింట్లను మార్చాలి. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి. ఈ సంవత్సరంలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కు రెండు బి.సి గురుకుల పాటశాలలు మంజూరు చేయాలి. విదేశ విద్య స్టైఫండ్ స్కీమ్ క్రింద అర్హులందరికీ స్టై ఫండు ఇవ్వడానికి దీని బడ్జెట్ 60 కోట్ల నుంచి 300 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

## సబితా ఇంద్రారెడ్డి కృషితోనే మెడికల్ కళాశాల

**విశ్వంభర,ఎల్బీనగర్:** మహేశ్వరం శాసనసభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి కృషితోనే మహే శ్వరం నియోజకవర్గానికి మెడికల్ కళాశాల మంజూరూ అయిందని నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురు కుంట్ల అరవింద శర్మ అన్నారు. బుధవారము ఆర్కే పురంలో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు ప్రతిపాదన పంపిన తిరస్కరించిందన్నారు. అయినా సబిత ఇంద్రారెడ్డి పట్టుదలతో ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి మంజూరు చేయించిం దన్నారు. మెడికల్ కళాశాల వల్ల నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయని అన్నారు. కళాశాల చుట్టుపక్క గ్రామాలకు వైద్యం అందుతుందన్నారు. మెడికల్ కళాశాల రావడానికి కృషి చేసిన సబితా ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## ఆర్సిఓ ఆపీసు మహబూబాబాద్ లోనే కొనసాగించాలి




**విశ్వంభర, మహబూబాబాద్:** ఎస్.ఎఫ్.ఐ, తెలంగాణ గిరిజన సంఘం, ఆధ్వర్యంలో గిరిజన గురుకుల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్ పార్లమెంట్ కేంద్రం లో ఎప్పటి నుండో కొనసాగుతున్న ఆర్. సి. ఓ. కార్యాలయం ములుగు జిల్లాకు తరలించాలని కొంత మంది ప్రభుత్వ మంత్రి అండదండలతో కుట్ర చేస్తున్నారని అన్నారు. తక్షణమే ఆ ఆలోచనను వెనక్కి తీసుకోవాలి అని,ఇప్పటికే ఐటిడిఏ ఆపీసు ములుగు దగ్గర్లో ఏటూరు నాగారం లో వుందని,మళ్ళీ ఆర్. సి. ఓ.ఆపిసును ములుగు తరలించడం అంటే మహబూబాబాద్ జిల్లా ప్రాంత వాసులకు అన్యాయం చేయడమే అని ధ్వజమెత్తారు. మహబూబాబాద్ పార్లమెంట్ కేంద్రంలో కచ్చితంగా వుండాల్సిందే అని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వినింగ్ కమిటీ సభ్యులు భూక్యా రాజేష్, వీరేందర్,గిరిజన సంఘం నాయకులు సొమ్లు నాయక్,వీరన్న నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు




**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జనం వెళ్లే మార్గాలను కలెక్టర్ అశోక్ సింగ్ వాన్ పరిశీలించారు. కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్ నుండి ఓల్డ్ బస్టాండ్, సుభాష్ రోడ్ పెద్ద బజార్ రోడ్డు మీదుగా నిజాం సార్ చౌరస్తా నుండి కొత్త బస్టాండ్ ఇందిరా గాంధీ స్టేడియం వరకు వెళ్లే మార్గాలను జిల్లాఎస్పి సింధు శర్మ, మున్సిపల్ చైర్పర్సన్ ఇందు ప్రియ, మున్సిపల్ అధికారులు విద్యుత్ అధికారులు, ఆర్ఎన్బి అధికారులు నిమజ్జనం వెళ్లే దారులను కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు కిందికి వెళ్లాలంటే దాన్ని సరిచేయాలని ఆయన సూచించారు. మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

### లింగ నిర్ధారణ, బ్రూణ హత్యలు

## బేటీ బచావో బేటీ పడావో పైన అవగాహన


**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షులు వంగ శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 10 వ తారికు మంగళవారం రోజున మోత్కూర్ పట్టణ కేంద్రంలోని వైజె ఫంక్షన్ హాల్ లో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మోత్కూర్ , గుండాల , అడ్డగుడూర్, ఆత్మకూరు(ఎం) మండలాల్లో గ్రామీణ వైద్యులుగా పని చేస్తున్న గ్రామీణ వైద్యులకు జిల్లా వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్, డెమో అధికారి మధుసూదన్ రెడ్డి, సి డి పి ఓ జ్యోత్స్న, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ హేమంత్ కుమార్ ల ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ , బ్రూణ హత్యలు , భేటి బచావో భేటి పడావో గురించి అవగాహన కల్పించిన సందర్భంగా వారికి ఆత్మకూరు(ఎం)మండలం తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సూదగాని లక్ష్మయ్య గౌడ్ , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల కోశాధికారి గడ్డం అశోక్ , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల ప్రచార కార్యదర్శి గుర్రం మల్లేష్ , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నిర్వాహకుడిగా శివకుమార్

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన పాడుగుల రాజేశ్వరీ–సంపత్ ల కుమారుడు పాడుగుల శివకుమార్ మండలంలోని ఇస్సి పేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ లో 10వ తరగతి వర కు చదివిన తర్వాత ఇంటర్మీడియట్ చదువులకు మరిపెడలోని గురుకులంలో చదివి వృత్తిరీత్యా వ్యాయామ ఉపాధ్యాయుడిగా తన విధులు నిర్వహిస్తున్నాడు. 2012 నుండి ఖోఖో ఆటలో అత్యున్నత ప్రదర్శన కనబరుస్తూ ఎన్నోసార్లు వరంగల్ జిల్లా టీం నుండి ఆడి తనదైన రీతిలో గుర్తింపు, మంచి పేరు తెచ్చుకొన్నాడు. తెలంగాణ టీం నుండి పాలు మార్లు క్రీడాకారుడిగా, కోచ్ గా గుర్తింపు పొందాడు. 2024–25 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నిర్వాహకులుగా తాను పని చేసే పాఠశాల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. హైదరాబాద్ లో ఖోఖో బాలుర జట్టుకి హెడ్ కోచ్‌గా నియమితులు అయ్యాడు. నన్ను ప్రోత్సహించిన మేన మామ గుత్తికొండ బాలకృష్ణ, కోచ్‌లు సురేష్, సదానందం, విజేందర్ లకి ఆయన ప్రత్యేక ధన్యవాదములు తెలిపాడు.



## వినాయక మండపాలను దర్శించుకున్న ఉప్పల



**విశ్వంభర, నాగోల్:** గణేష్ ఉత్సవాలల్లో భాగంగా కొత్తపేట లోని హోమం కార్యక్రమం, ఆశీర్వాద్ అపార్ట్మెంట్స్ లో గల వినాయకుణ్ణి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన టిపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ,అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలుతో, ఆరోగ్యాలుతో జీవించాలని, పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిలకంటి రాజు గుప్త, అంబరీష్ గుప్త, నాంపల్లి శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు తీర్పుకు మందకృష్ణ మాదిగకు ఎలాంటి సంబంధం లేదు



**విశ్వంభర, కరీంనగర్:** జిల్లా షెడ్యూల్ కులాల ఏబిసిడి వర్గీకరణ పై సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించిన డా. పిడమర్తి రవి పాల్గొని మాట్లాడారు. ఈ తెలంగాణ రాష్ట్రంలో విడి విడిగా కార్యక్రమాలు పెట్టాలి. జిల్లా రాష్ట్రవ్యాప్తంగా 30 సంవత్సరాలుగా చాలా సందర్భాలలో సభలు సమావేశాలు పెట్టుకుంటున్నాము ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా మన మాదిగలు ఉద్యమానికి సహకరించాలి 30 ఏళ్లుగా ప్రారంభమైన ఈ యొక్క మాదిగ ఉద్యమం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. SC - ABCDకి సంబంధించి సుప్రీం కేవలం తీర్పు మాత్రమే ఇచ్చింది చట్టం తేవాలి, చట్టానికి కావాల్సిన చట్టం చేసి ఆర్డినెన్స్ తేవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మాదిగ ఉద్యమంలో ధర్మముంది కాబట్టే సుప్రీంకోర్టు న్యాయం చేయగలిగింది తప్ప వర్గీకరణకు నరేంద్ర మోడీకి ఎలాంటి సంబంధం లేదు. సుప్రీంకోర్టు ప్రకారం చట్టం చేస్తే ఈ రాష్ట్రంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు కొనియాడారు. నేను పిడమర్తి రవిగా మళ్లీ మళ్లీ చెప్తున్నా సుప్రీంకోర్టు తీర్పుకు మందకృష్ణ మాదిగకి ఎలాంటి సంబంధం లేదు. మనం న్యాయం వైపు ఉన్నాం కాబట్టి సుప్రీంకోర్టు మనకు తీర్పు న్యాయం చేసింది తప్ప దీనికి మందకృష్ణకి ఏలాంటి సంబంధం లేదు. మందకృష్ణ మాటలను మాదిగల నమ్మే పరిస్థితి ఈ రాష్ట్రంలో లేదు అని వారు అన్నారు. ఈ తెలంగాణ రాష్ట్రంలో కొన్ని సంఘాలు అందరం కలిసి మాదిగలకు 12% రిజర్వేషన్ అమలు చేయాలని మేము పోరాటం చేస్తున్నాము అని అన్నారు. 12% కొరకు కొట్లాడిన కూడా ఈ తెలంగాణలో మాదిగల న్యాయం జరగడం లేదని వారు మాట్లాడారు. ఈ వేదిక నుంచి నేను మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్న ఉమ్మడి పాలమూరు జిల్లాలో మాదిగల జనాభా ఎక్కువ శాతం ఉన్నది అక్కడ వారు ఎంత శాతం ఉన్నారో వారికి అంత రిజర్వేషన్ అక్కడ ఇవ్వాలని వారు ఈ ప్రభుత్వాన్ని కోరారు. ఒక పాలమూరు జిల్లాకే 14% శతం రిజర్వేషన్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా సంఖ్య 80% శాతం అయితే,, 20%శాతం ఉన్న అగ్రవర్ణాలకు 6%శాతం రిజర్వేషన్ ఇచ్చి ఈ రాష్ట్రంలో 80 శాతం ఉన్న మాదిగలకు ఎందుకు 12% రిజర్వేషన్ ఇవ్వరని మేము అడుగుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఏ విధంగా అయితే జిల్లాల వారీగా రిజర్వేషన్ అమలు చేస్తున్నారో అదేవిధంగా ఈ తెలంగాణ రాష్ట్రంలో కూడా మాదిగల యొక్క రిజర్వేషన్ జిల్లాల వారీగా పంచాలని పిడమర్తి రవి ప్రభుత్వాన్ని కోరారు.

## బదిలీపై వచ్చిన నూతన అధ్యాపకులకు సన్మానం



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై నూతనంగా వచ్చిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కళాశాల స్టాఫ్ క్లబ్ తరపున సన్మానం చేశారు. తెలుగు అధ్యాపకులు శ్రీమతి ప్రసూనా దేవి, లైబ్రేరియన్ జానయ్య, రికార్డ్ అసిస్టెంట్ శ్రీమతి అనురాధ కళాశాలకు బదిలీపై నూతనంగా రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుంగ సంజీవ నూతన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కళాశాల తరపున స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పున్నారావు, వెంకట్ రెడ్డి, కిరణ్, నరసింహారావు, అశోక్, శ్రీకాంత్, నగేష్, ఉపేందర్, నిర్మల, రాజేశ్వరి, ఉమారాణి, కరుణ, నాగమణి, నరసయ్య, యాదయ్య, వెంకటయ్య, పరమేశ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ రిజర్వేషన్‌ల వ్యతిరేకి

### బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ రామ్‌జీ గౌతమ్



**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ రిజర్వేషన్‌ల వ్యతిరేకి అని బీఎస్పీ సెంట్రల్ కో ఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ తీవ్రంగా విమర్శించారు. బుదవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చిరాజ్యాంగం అమలు అయిన నాటి నుండి బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయలేదన్నారు. నలబై మూడు సంవత్సరాల పాటు బీసీలు అన్ని రంగాల్లో వారి వాటాను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో ఈ దేశంలో అధికారంలోకి వస్తే రిజర్వేషన్ లు తొలగిస్తామని మాట్లాడిన తీరును రాంజీ గౌతమ్ తీవ్రంగా తప్పు పట్టారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ పార్టీలు రాజ్యాంగంను రద్దు చేయాలని కుట్ర చేస్తున్నాయని అన్నారు. ఈ దేశంలో కుల గణన వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎస్సీలను విడదీయాలనీ బీజేపీ కుట్ర చేస్తుందని అన్నారు. దేశంలో ఎస్సీ లను విభజించి పాలించు అనే కుట్రతో బీజేపీ ఆలోచిస్తుందని అన్నారు. దేశంలో రాష్ట్రంలో మహిళలపై మానభంగాలు జరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నాయని అన్నారు. దళిత ప్రజలపై అమానుషమైన దాడులకు కాంగ్రెస్ బీజేపీలే కారణమన్నారు. మాయావతి దేశంలో బహుజన సమాజం కోసం కొట్లాడే ఒకే ఒక్క నాయకురాలు అని అన్నారు. మాయావతి ప్రధాని అయితేనే బహుజనుల బ్రతుకులు బాగుపడతాయాన్ని అన్నారు. తెలంగాణా ఆంధ్రప్రదేశ్ లలో పార్టీని బూత్ స్తాయి వరకు నిర్మించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి రానున్న శాసన సభ ఎన్నికల్లో అధికారంలోకి రావాలని క్యాడర్‌కి హితబోధ చేశారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ సభధ్యక్షత వహించగా ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ పూర్ణ చందర్ రావు, బాలన్న, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పరం జ్యోతి, తెలంగాణా ఉపాధ్యక్షులు రామ్ కృష్ణ, ప్రధాన కార్యదర్శు లు ఇబ్రామ్ శేఖర్, బోడపట్ల ఈశ్వర్, అడ్వకేట్ నిషాని రామచంద్రం, గుండెల ధర్మేందర్, మేడి ప్రియదర్శిని, అనిత రెడ్డి, బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ అంకని భాను, ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి వందన్ కుమార్, ఉపాధ్యక్షులు గౌతమ్ బందెల, ప్రధాన కార్యదర్శి మల్లికల్, నాయిని ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రంలోని సురసముద్రం చెరువు కట్టపై గణేష్ నిమజ్జనాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సీఐ ప్రమోద్ కుమార్, ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత తెలియజేశారు. ఆమనగల్‌లో ప్రతిష్టించిన వినాయక ప్రతిమలను ఆమనగల్ చెరువులో వాహనాలలో గణేష్ నిమజ్జనం చేయాలనుకునే వారు సంకటోనిపల్లి గేటు వద్దనుండి ఆమనగల్ చెరువు కట్ట పైకి వాహనంతో రావాలని అక్కడ అన్ని ఏర్పాట్లు క్రేన్, మున్సిపల్ సిబ్బంది ఉంటారని నిమజ్జనం అయిన తర్వాత కట్ట మైసమ్మ దేవాలయం వద్ద తిరిగి అదే రూట్లో వెళ్లాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించ కూడదని శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలని సీఐ తెలిపారు.

## విల్ చైర్ క్రికెట్ టీంకు నగదు అందించిన కౌన్సిలర్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కొంపల్లి కౌన్సిలర్ జోష్నా శివారెడ్డి వైకల్య ప్రతిభావంతులకు నగదు అందజేశారు. డి,సి,సి,బి, ఐ, బోర్డు జాతీయ అంతర్జాతీయ, వీల్ చైర్ క్రికెట్ టీం సభ్యుల ఎంపిక చేశారు. ఎస్.సీ.ఎఫ్ గ్రౌండ్ మాసబ్ ట్యాంక్ లో క్రికెట్ ఆడేందుకు 16 జిల్లాల నుండి 35 మంది వీల్ చైర్ క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు ఏ మరియు బి, టీములుగా విభజించి టీ 20 ఆటను నిర్వహించడం జరిగింది. ఇందులో విజేతగా బీ టీమ్ నిలిచింది. బీ టీమ్,121 పరుగులు చేయగా ఏ టీం 101 పరుగులకే ఆల్ అవుట్ అయింది. ప్రోత్సాహం కొరకు అంతర ఫౌండేషన్ చైర్మన్ కందడి జోష్నా శివారెడ్డి బి, డి, సి, దివ్యాంగ్ ఆల్, పారా, క్రికెట్ అసోసియేషన్ కు రూ.20,000ల రూపాయల నగదును అందజేయడం జరిగింది. వారు మాట్లాడుతూ ఇలాంటి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. గతంలో కూడా వీరికిగతంలో క్రికెట్ కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వీల్ చైర్ క్రికెట్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీధర్ రాయల, వీల్ చైర్ క్రికెట్ తెలంగాణ రాష్ట్ర కెప్టెన్ సంయుద్దిన్, తెలంగాణ నుండి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## అన్ని దానాలలో కంటే గొప్పది అన్నదానం దానం



**విశ్వంభర, ఆమనగల్లు:** అన్ని దానాల్లోకెల్లా అన్నదాన మహా గొప్పదని కల్వకుర్తి ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆయన ఆమనగల్లో మార్కండేయ యువజన గణేష్ కర్తాల్ లోని జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడి దర్శనం చేసుకునే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆమనగల్లులో గుజ్జరి ప్రవీణ్ కర్తాల్లో గూడూరు శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరమని, ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో సంతోషంగా పండుగ జరుపుకోవాలని పేర్కొన్నారు. యువత కూడా ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాలుపంచు కోవడం సంతోషంగా ఉందన్నారు. పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, గాజుల శీను, శివలింగం, అప్పం శీను, ఎంగలి ప్రసాద్, మామిడి శెట్టి రవి, రామకృష్ణ, హన్మ నాయక్, మలే మల్లేష్, చెందోజీ, క్యామ రాజేష్, భానుకిరణ్ పాల్గొన్నారు.

## కమిటీ సభ్యుడిగా వేముల వీరేశం

### హర్షం వ్యక్తం చేసిన నకిరేకల్ నియోజకవర్గ మాజీ సర్పంచులు



**విశ్వంభర, రామన్నపేట:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడిగా నియామకం నకిరేకల్ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే వేముల వీరేశంకు లక్ష్మాపురం, కొత్తగూడెం గ్రామాల తాజా మాజీ సర్పంచులు ఉప్పు ప్రకాష్, చిల్లర కైలాసం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిరెడ్డి సత్తిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రామిక గణేష్ మండల్ వద్ద ప్రత్యేక పూజలు



**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్ నగర్ పట్టణంలో నివాసముంటున్న ప్రైవేట్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులు గత 26 సంవత్సరాలుగా షాద్‌నగర్ మున్సిపాలిటీ 18వ వార్డులో వినాయక నవ రాత్రులను నిర్వహిస్తున్నారు. బుధవారం శ్రామిక గణేష్ మండపం వద్ద ముఖ్య అతిథులుగా విచ్చేసిన షాద్ నగర్ ప్రముఖ పౌల్ట్రీ పారిశ్రామిక వేత్త పాతూరి వెంకట్ రావు, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, మాజీ ఎంపీపీ వాన్నడ ప్రకాష్ గౌడ్ పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. షాద్ నగర్ పట్టణంలో ప్రవేట్ పరిశ్రమ కార్మికులు ఐక్యంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు 26 సంవత్సరాలుగా జరుపుకోవటం ఆనందదాయకం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు కార్మికులలో ఐక్యతను ప్రతిభింభిస్తుందని, కార్మికులు కుట్టుంబ సభ్యులతో పాల్గొని ఆ గణనాథుని పూజించడం సంతోషంగా ఉందన్నారు. యువనాయకులు వన్నాడ వెంకటేష్ గౌడ్, నక్కల వెంకటేష్ గౌడ్, చెట్ల నరసింహ, చంద్రశేఖర్ అప్ప, గుదె సతీష్, కమిటీ సభ్యులు వేణుగోపాల్‌నాయుడు, ముత్తు, పోల్ నాయుడు, అచ్చుత్ రావు, ఆనందరావు, కరుణాకర్, లక్ష్మణ్‌రావు, దేములు, శ్యామల రావు, భోగేశ్వర్ రావు, ఈశ్వర్ రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ ఈటల



**విశ్వంభర, నల్గొండ:** నల్గొండ పట్టణ కేంద్రంలోని మహారాణ ప్రతాప్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలలో మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాలొన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ గణేష్‌ఉత్సవాల గురించి, ఆది దేవుడు అయినా గణనాథుడి విశిష్టతను తెలియజేసారు. కమిటీ సభ్యులు ఎంపీకి శాలువాతో సన్మానించారు.

## ఘనంగా గణేష్ ఉత్సవాలు



**విశ్వంభర,నల్గొండ:** గణపతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గణేష్ వేడుకలను అంగ రంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. నల్గొండ పట్టణ కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలోని ఎస్ ఆర్ యూత్ 32 వ వార్డులో ఏర్పాటు చేసిన బడా గణేష్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు వెయ్యికి పైగా భక్తులు పాల్గొన్నారు.



(విశ్వంభర, ఆత్మకూరు(ఎం)): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం బీఆర్ఎస్ పార్టీ యూత్ సెక్రెటరీ జనరల్ యాస మహేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఆలేరు తాజామాజీ ఎమ్మెల్యే మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి.

## ఇన్ముల్ నర్వ రెడ్డి సంఘం మొదటి వార్షికోత్సవం



**విశ్వంభర, రంగారెడ్డి:** కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వ గ్రామంలో ఇన్ముల్ నర్వ రెడ్డి సంఘం అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇన్ముల్ నర్వ రెడ్డి సంఘం మొదటి వార్షికోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని రెడ్డి సంఘం లఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు మహేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఇంద్రాసెనా రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, భూపతి రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ లైన్మన్ పదవీ విరమణ



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం, శోభనాద్రిపురం, నీర్నెముల గ్రామాలకు లైన్మన్‌గా పని చేసిన ఆకుల మల్లయ్య 2024 ఆగస్ట్ నెలలో పదవీ విరమణ చేసాడు. బుదవారం మూడు గ్రామాల ప్రజలు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. సన్మాన కార్యక్రమాన్ని బోగారంలోని సాయిరాం ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ప్రజలు లైన్మన్ కి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. తమ గ్రామాలకు అతను చేసిన సేవలను కొనియాడారు. అతను ఆయురారోగ్యాలతో, సుఖ-సంతోషాలాతో ఉండాలని కోరారు. లైన్మన్న ఆకుల మల్లయ్యకు బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్

## బోడుప్పల్లో ఉన్న ప్రధాన సమస్యలపై సీఎంకు వినతి

## సాలుకూలంగా స్పందించిన సీఎం: రేవంత్ రెడ్డి



**విశ్వంభర, మేడిపల్లి:** సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కాంగ్రెస్ నాయకులు కలిశారు. మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ముఖ్యమంత్రి జంట కార్పొరేషన్ల మేయర్ లను శాలువాతో సన్మానించి, అభినందించారు. మేడ్చల్ నియోజవర్గ అభివృద్ధికై ప్రత్యేక నిధులు కోరుతూ వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి వినతి పత్రం అందించారు. అంతేకాకుండా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రధాన సమస్య అయినటువంటి వక్ఫ్ బోర్డు భూముల సమస్యతో ఆగిపోయిన రిజిస్ట్రేషన్లు తిరిగి పునఃప్రారంభించాలని కోరారు. బోడుప్పల్ లోని సర్వే నెం 63 లో గత ప్రభుత్వం దళితులకు చేసిన అన్యాయాన్నీ గురించి సీఎంకు వివరించారు. బోడుప్పల్ సమస్యలపై సీఎంకి వినతిపత్రాలు అందించగా దానికి వారు సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ప్రభుత్వం ఈ సమస్యలపై దళితులకు న్యాయం చేకూర్చేవిదంగా చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ చైర్మన్ దీపిక నర్సింహా రెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న గణపతి నవరాత్రులు ఉత్సవాలు



**విశ్వంభర, సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ పద్మారావు నగర్‌లో కాంగ్రెస్ సీనియర్ లీడర్, కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ సొసైటీ యూత్ అసోసియేషన్, గణపతి నవరాత్రులు ఉత్సవాల భాగంగా నాలుగవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్.సీ.సీని ప్రారంభించిన ఆర్మీ కమాండ్ ఆఫీసర్




**విశ్వంభర, త్రిపురారం:** నల్గొండ జిల్లానాగార్జునసాగర్ నియోజకవర్గం త్రిపురారం మండలం కంపసాగర్ మోడల్ స్కూల్లో ఎన్.సీ.సీ ని ఆర్మీ కమాండ్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. వీరితో పాటు మోడల్ స్కూల్ ఎన్.సీ.సీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్ ఎం మాధవరావు, సుబేదార్ జగన్నాథం, హరిమిత్ సింగ్, ఎన్.సీ.సీ ఏ.ఎన్.ఓ.ఎన్ రవి, పాఠశాల ప్రిన్సిపల్ బూరుగు నిర్మల, ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలకు ఎన్.సీ.సీ రావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి కే ఎల్ ఆర్

**విశ్వంభర, మహేశ్వరం:** బడంగ్ పేట వినాయక నిమజ్జనాల్లో పోలీసు శాఖ నియమ నిబంధనలు పాటించాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. బడంగ్ పేట కార్పొరేషన్ 28వ డివిజన్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బంగారి అశోక్ ఏర్పాటు చేసిన చవితి ఉత్సవాలు అన్నదాన కార్యక్రమంలో కేఎల్ఆర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల పూజలతో యావత్ దేశంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందన్నారు. అనంతరం గోశాలలో ఉన్న గోమాతకు పూజ చేశారు. మద్యం సేవించి, మత్తు పదార్థాలతో నిమజ్జనాలకు రావొద్దన్న పోలీస్ నిబంధనలు పాటించాలని కేఎల్ఆర్ కోరారు. ఈకార్యక్రమంలో బడంగ్ పేట కార్పొరేషన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

విశ్వంభర, మహేశ్వరం: కందుకూరు మండలంలో గల సర్వసభ సమావేశం లో 71 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు సబితా ఇంద్రా రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నాయకులు,కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నిత్య విద్యార్థిగా ఉంటేనే అభివృద్ధి

### ప్రతీ విద్యార్థికి జీవితం పట్ల గోల్ ఉండాలి

### సమాజానికి రోల్ మోడల్ గా ఆడపిల్లలు తయారు కావాలి



**విశ్వంభర,మహేశ్వరం:** ప్రభుత్వ బడులు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. చేవేళ్ల మండలం తోలుకట్ట గ్రామంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో విద్యార్థినులతో మమేకం అయ్యారు. తన లీడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ద్వారా లక్షలాది మంది విద్యార్థులకు గోల్ - రోల్ ఉన్నత విలువలతో కూడిన జీవితంపై కేఎల్ఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి, దివంగత శ్రీ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో చదువువే ఆయుధం ప్రపంచాన్ని అన్ని రంగాల్లో జయించాలన్నా విద్యతోనే సాధ్యమని చెప్పారు. విద్యార్థి దశలో లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగితే విజయం మీ సొంతం అవుతుందని వారిలో స్ఫూర్తి నింపారు కిచ్చెన్నగారు. ఈకార్యక్రమంలో బీసీ గర్ల్స్ హాస్టల్ హెడ్ మాస్టర్ సహా సిబ్బంది పాల్గొని కేఎల్ఆర్ సంస్థ చేస్తున్న లీడ్ ఇండియా ప్రోగ్రాంను అభినందించారు.

## ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం



**(విశ్వంభర, హైదరాబాద్):** ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్, జేఏసీ చైర్మన్ కోదండ రామ్ ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ ఆధ్వర్యంలో అంబర్ పేట కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్ లరెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే కాలేరు

### అభివృద్ధి పనుల నిధులను మంజూరు చేయాలని వినతి

**విశ్వంభర, హైదరాబాద్:** అంబర్ పేట నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్ లో అభివృద్ధి పనులకు సంబంధించిన రూ. 11 కోట్ల నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జోనల్ కమిషనర్ ను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ నిధులను తక్షణమే విడుదల చేసి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి నిధుల మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తానని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## గణనాథుడికి ఘనంగా ప్రత్యేక పూజలు

**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రంలోని జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద గూడూరు శ్రీనివాస్ రెడ్డి గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమాన్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సీఐ శివ ప్రసాద్, ఎస్సై వరప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, కాలనీవాసులు మండపం ప్రాంగణంలో పలు సంస్కృతిక కార్యక్రమాలు, వినాయకుడి భక్తి పాటలు పాడి శ్రోతలను అలరించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ గౌడ్, రామకృష్ణ, రాజు, యాదయ్య, రంగయ్య, పాండు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక మట్టి తరలిస్తున్న వాహనాలపై కేసు నమోదు




**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఆమనగలు సీఐ తెలిపారు. తలకొండపల్లి మండలం దొంగ రోడ్డు తుమ్మలకుంట తండా వద్ద పెద్దూరు తండాకు చెందిన కేతావత్ రెడ్య అక్రమంగా ఇసుక తరలిస్తుండగా డ్రైవర్ ప్రభాకర్‌ను ట్రాక్టర్‌ను అదేవిధంగా ఆమనగల్ మండలం మేడిగడ్డ తండా కు చెందిన నేనావత్ దేవేందర్ తన టిప్పర్‌తో అక్రమంగా మట్టి తరలిస్తుండగ వాహనాన్ని, డ్రైవర్ను అదుపులోకి తీసుకొని రెండు కేసులు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేసి, జైలుకు పంపుతామని అని అమంగల్ సీఐ ప్రమోద్ కుమార్ తెలిపారు.

# గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం నియోజకవర్గం లెమూర్ గ్రామంలో గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో గణేష్ పూజ, అన్నదానం కార్యక్రమనికి ముఖ్య అతిధిగా మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చేనా గారి లక్ష్మ రెడ్డి విచ్చేశారు. ఈసందర్బంగా మాట్లాడుతూ పంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కోరుప్రోలు రాణా ప్రతాప్ రెడ్డి, మండల్ కో ఆర్డినేటర్ మొహ మ్మద్ అఫ్జాల్ బేగ్, ముల హన్మంత్ రెడ్డి, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, కంబాల పల్లి విష్ణు వర్ధన్ రెడ్డి, అఖిల్, రహీమ్, గూడూరు రవీందర్ రెడ్డి, ములఇంద్రరెడ్డి, గూడూరు మధుకర్ రెడ్డి, గుల్వి దేవేందర్ ఎలుక సుధాకర్ రెడ్డి, బావి రెడ్డి, చిత్తరి లక్ష్మయ్య, మంచాల దర్శన్, కిషన్, మంచాల వెంకట య్య, కత్తుల సైదులు గంగరి, జంగయ్య, జైత్వరం నర్సింహా, మంచాలా రాములు, డప్పు నర్సింహా, మంచాల యాదయ్య, చింతకింది విక్రమ్, చింతకింది రాములు, మంచాల దేవేందర్, బుద్దా మైసయ్య, మంచాల శంకరయ్య,శేఖర్, యాచారం భాస్కర్, ముచర్ల మహేందర్, ఇమిడి పోచయ్య, గుల్వి రవీందర్ పాల్గొన్నారు.



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ను మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే మల్లారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. (విశ్వంభర, మేడ్చల్)

## బీసీ కమిషన్ సభ్యులుగా రాపోలు జయప్రకాష్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఏలూరి సుదర్శన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పద్మశాలి ముద్దుబిడ్డ, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాపోలు జయ ప్రకాష్‌ని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులుగా నియమించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, ఉత్తమ్ కుమార్ రెడ్డికి, తుమ్మలనాగేశ్వరరావుకి, కొండాసురేఖకి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి ధన్యవాదాలు తెలిపారు.

## బాలీశ్వరి మాత ఆశ్రమంలో 12వ ఆరాధన మహోత్సవము



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం మాధాయపల్లి గ్రామంలో శ్రీ సద్గురు యోగిబాలీశ్వరి మాత ఆశ్రమంలో ఆశ్రమ పూర్వపు పీఠాధిపతి జగన్నాథ స్వామి 12 వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సి ఎల్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. దైవ కార్యక్రమాల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి శంకరయ్య గౌడ్, కార్యవర్గ సభ్యులు భక్తులు, స్వాములు, గ్రామస్థులుపాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలి



**విశ్వంభర చింతపల్లి:** చింతపల్లి మండల వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో చింతపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువు దీరిన బొజ్జ గణపయ్య వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు గోవిందు యాదగిరి-రాధిక దంపతుల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు గోవిందు నారయ్య-భారతమ్మ, గోవిందు రఘు-స్నేహ పాల్గొన్నారు. బీసీ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వారికి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు, అయ్యప్ప గురుస్వామి గోవిందు యాదగిరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## నిమర్జనాల దృష్ట్యా చెరువులు, కుంటల వద్ద భద్రత ఏర్పాట్లు



**విశ్వంభర, పటాన్‌చేరు:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో కీలక ఘట్టం నిమర్జనం. పటాన్ చేరు అమీన్‌పూర్, బొల్లారం పోలీసుస్టేషన్ల పరిధిలో గల చెరువులు, కుంటలలో వినాయక నిమర్జనాలు చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, నీళ్లలోకి ఎవ్వరూ దిగకుండా బారికెట్స్ ఏర్పాటు చేయాలని, చెరువుల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసే విధంగా సంభందిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. నిమర్జనానికి వచ్చి, పోయే వాహనాలకు ఇబ్బంది లేకుండా వెళ్ళడానికి అప్ అండ్ డౌన్ రోడ్లు వేరు వేరుగా ఉండాలన్నారు. ప్రతి చెరువు వద్ద గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎలాంటి భద్రత పరమైన సమస్యలు తలెత్తకుండా మొబైల్ పెట్రోలింగ్ చేస్తూ ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమములో ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు, పటాన్చేరు డియస్పి రవీందర్ రెడ్డి, పటాన్ చేరు ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, అమీన్ పూర్ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, తదితరులు ఉన్నారు.

## జగదాంబ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో భగవద్గీత జ్ఞాన సంబరాలు




**విశ్వంభర, అమనగల్లు:** జగద్గురువు పిరమిడ్ ధ్యాన గురువు పత్రీజీ దివ్య ఆశీస్సులతో డాక్టర్ కసిరెడ్డి స్నేహలతారెడ్డి, డాక్టర్ కసిరెడ్డి సింధు లతారెడ్డిల ఆధ్వర్యంలో జగదాంబ ధ్యాన పిరమిడ్ కేంద్రంలో భగవద్గీత ధ్యాన జ్ఞాన సంబరాలు ఘనంగా నిర్వహించారు. వారు ఆమనగల్లు మండలంలోనే కాక ఇతర ప్రాంతాలలో ఉన్న వారికి ఆఫ్లైన్ ఆన్లైన్ లో భగవద్గీత జ్ఞానాన్ని గత సంవత్సరం నుండి బోధిస్తూ ఉన్నారు. ముఖ్య అతిథిగా సూర్యలక్ష్మి కాటన్ మిల్ జిఎం సాయిబాబా, విశిష్ట అతిథులుగా దేవేందర్ గుప్తా, శాంతమ్మ పాల్గొన్నారు. భగవద్గీత జ్ఞానాన్ని శ్లోకం రూపకంగానే కాకుండా నాటికలతో, డాన్స్ తో, మాటలతో విద్యార్థిని విద్యార్థులు చక్కగా ప్రదర్శనలు చేసినందుకు మెమెంటో లతో వారిని అభినందించారు.

# ఇదంతా జగన్ కుట్ర

**- మంత్రి నారా లోకేశ్**

**విశ్వంభర, అమరావతి :** ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి లోకేశ్ తాజాగా మరోసారి తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. వరద ముంపునకు కూటమి ప్రభుత్వమే కారణమంటూ వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా ఆయన మండిపడ్డారు. వైసీపీ నేతలు చేసిన కుట్రలు ఎక్కడ బయటపడుతాయోనని ఈ విధంగా విష ప్రచారం చేస్తున్నారని ఫైరయ్యారు. లక్షలాది మంది జలసమాధి అయ్యేలా సైకో జగన్ పన్నిన కుట్ర బట్టబయలైందంటూ లోకేశ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. ప్రకాశం బ్యారేజ్ కూల్చి లక్ష మంది పైనే ప్రజలను చంపటం జగన్ లక్ష్యం అని పేర్కొంటూ జగన్, పడవలు ఉన్నటువంటి ఫొటోను జత చేస్తూ.. దాని కామెంట్ పోస్ట్ చేశారు. ఆ కామెంట్ లో ఈ విధంగా పేర్కొన్నారు. 'అధికారం అండగా సైకో జగన్ తన ఇసుక మాఫియా కోసం అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయేలా చేసి 50 మందిని చంపేసి, ఐదు ఊర్లు పూర్తిగా నామరూపాలు లేకుండా చేశారు. ఇదే ప్లాన్ ను అనుసరించి ఇనుప పడవలతో ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టి, దానిని



కూల్చివేసి విజయవాడతోపాటు పదుల సంఖ్యోల లంక గ్రామాలను నామ రూపాలు లేకుండా చేసి లక్షలాది మంది ప్రజలు జల సమాధి అయ్యేలా సైకో జగన్ పన్నిన కుట్ర బట్ట బయలైంది. ప్రకాశం బ్యారేజీని పడవలతో కూల్చేయాలనే కుట్ర ప్లాన్ చేసింది సైకో జగన్ అయితే, ప్లాన్ అమలు చేసింది వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్. తమ కుట్రలు బయటపడకుండా వరద ముంపునకు ప్రభుత్వమే కారణమంటూ విషప్రచారం చేస్తుంది సైకో జగన్ ముఠా' అంటూ లోకేశ్ అందులో పేర్కొన్నారు. ఇటు హోంమంత్రి అనిత కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం బ్యారేజీ కూల్చివేతకు జగన్ కుట్ర పన్నారని, అందుకు సహకరించిన వాళ్లపై కూడా దేశ ద్రోహం కేసు పెట్టాలన్నారామె. ఒక క్రిమినల్ రాజకీయ నాయకుడైతే ఎటువంటి పరిణామాలు ఉంటాయో అనేది ఇప్పుడు స్పష్టంగా ప్రజలకు అర్థమవుతుందంటూ ఆమె పేర్కొన్నారు. మాజీ ఎంపీ నందిగాం సురేష్ ఇసుక లూటీ కోసం వాడిన బోట్లనే ప్రకాశం బ్యారేజీ ధ్వంసం చేయడానికి వాడారంటూ ఆమె మండిపడ్డారు. కౌంటర్ వెయిట్స్ కు కాకుండా పిల్లర్స్ కూలిపోయి ఉంటే నష్టం మాటలకు అందేది కాదన్నారు. బోట్లు పోయాయంటూ ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదన్నారు. ఉద్దదంద రాయుడు పాలెం దగ్గర ఉండాల్సిన బోట్లు బ్యారేజ్ ఎగువకు ఎలా వచ్చాయంటూ అనిత ప్రశ్నించారు.

'దీనిపై పూర్తి విచారణ జరిపిస్తాం. ఘటన వెనుక ఉన్న బాధ్యులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. ప్రకాశం బ్యారేజీ వద్ద మొత్తం ఐదు బోట్లు వదిలితే అందులో రెండు మునిగిపోయాయి. మరో మూడు పడవలు కౌంటర్ వేయిట్స్ దెబ్బతీశాయి. ఆ బోట్లు ఎవరివో తేల్చి బాధ్యులందరిపైనా చర్యలు తీసుకుంటాం. మొరిగేవాళ్లను మేం పట్టించుకోం. వైసీపీ నేతలు హ్యూమానిటీ లేకుండా ప్రవర్తిస్తున్నారు. చంద్రబాబు పనితీరు, క్రైసిస్ మేనేజ్మెంట్ ఎలా ఉంటుందో ఆ పార్టీలో రాజకీయాలు ప్రారంభించిన మాజీ మంత్రి అమర్నాత్ కు తెలియదా?. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేందుకు సోషల్ మీడియాలో వక్రీకరించి ప్రయత్నాలు చేస్తున్నారు. వరదలకు సీఎం, హోంమంత్రి, జగన్ మోహన్ రెడ్డి ఇల్లా అనే తేడా ఉండదు. వైసీపీ నేతలు ఏ మాత్రం సిగ్గు లేకుండా... రాష్ట్రంలో కొనసాగుతున్న సహాయక చర్యలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

విజయవాడలో వచ్చిన వరదలను ఓ కేసు స్టడీగా తీసుకుని సహాయక చర్యలపై ప్రణాళికా బద్ధంగా ముందుకువెళ్తున్నాం. నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో అక్రమాలపై విచారించి చర్యలు తీసుకుంటాం. ఇందుకు సంబంధించిన ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇటు ఏలేరు వరదలలో సహాయక చర్యలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. అటు విశాఖ నగరంలో కొండవాలు ప్రాంతాల పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలను చేపట్టింది' అంటూ అనిత పేర్కొన్నారు.



## వరద బాధితులకు హీరో సాయి దుర్గా తేజ్ ఆర్థిక సాయం

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో ఇటీవల సంభవించిన వరదలతో లక్షలాది ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. ముఖ్యంగా విజయవాడ నగరం వరద గుప్పిట్లో చిక్కుకుని విలవిల్లాడింది. విజయవాడలో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో, వరద బాధితుల కోసం ఏపీ ప్రభుత్వానికి పెద్ద ఎత్తున విరాళాలు అందుతున్నాయి. తాజాగా, మెగా హీరో సాయి దుర్గా తేజ్ ఏపీ మంత్రి నారా లోకేశ్ ను కలిసి రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్ ను మంత్రి లోకేశ్ మనస్ఫూర్తిగా అభినందించారు. ఇక, ఇవాళ కూడా నారా లోకేశ్ ను చాలామంది కలిసి విరాళాలు అందించారు. సచివాలయంలోని 4వ బ్లాక్ లో మంత్రి నారా లోకేశ్ ను కలిసిన దాతలు చెక్కులు అందజేశారు. డిక్షన్ గ్రూప్ తరపున రూ.1 కోటి చెక్ ను కంపెనీ ప్రతినిధులు లోకేశ్ కు అందించారు. నెక్కంటి సీ ఫుడ్స్ తరఫున సంస్థ ప్రతినిధులు రూ.1 కోటి విరాళం అందించారు.

## అటవీ వనరుల రక్షణ అమరులకు పవన్ నివాళులు



**విశ్వంభర, అమరావతి :** నేడు జాతీయ అటవీ అమరవీరుల దినం అని ఏపీ డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ బుధవారం వెల్లడించారు. అటవీ వనరుల రక్షణలో ప్రాణ త్యాగం చేసిన వారికి నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. బిష్ణోయ్ తెగ త్యాగాన్ని స్మరించుకుంటూ అటవీ అమరవీరుల దినం జరుపుకుంటున్నామని పవన్ పేర్కొన్నారు. ఏపీలో ఎర్రచందనం, శ్రీగంధం వంటి విలువైన వృక్ష జాతులు ఉన్నాయని వెల్లడించారు. అత్యంత అరుదైన వన్యప్రాణులకు ఆవాసం మన అటవీ క్షేత్రాలు అని వివరించారు. అమూల్యమైన అటవీ సహజ సంపదను కాపాడుకునేలా ప్రతిజ్ఞ చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.


## తెలుగు రాష్ట్రాల్లో వరద నష్టంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి నివేదిక



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** ఏపీ, తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ భారీ వర్షాలు, వరదల కారణంగా అనేక ప్రాంతాలు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలుగురాష్ట్రాల్లో పర్యటించి వరద నష్టంపై ప్రాథమిక నివేదిక రూపొందించారు. బుధవారం దిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాని కలిసి ఆ నివేదికను అందజేశారు. ఈ మేరకు శివరాజ్ సింగ్ ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. త్వరలోనే కేంద్ర బృందాలు వరద ప్రాంతాలను పరిశీలిస్తాయని, కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందుతుందని పేర్కొన్నారు.

**ఐఎంజీ భూముల వ్యవహారం.. విజయసాయిరెడ్డి వ్యాజ్యాన్ని**

## తోసిపుచ్చిన హైకోర్టు



**విశ్వంభర, హైదరాబాద్ :** ఐఎంజీ భూముల వ్యవహారంలో వైకాపా నేత విజయసాయిరెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. సీబీఐ దర్యాప్తునకు ఎలాంటి కారణాలు చూపలేకపోయారంటూ విజయసాయి పిటిషన్ ను సీజే ధర్మాసనం తోసిపుచ్చింది.ఎంఐజీ భూ కేటాయింపులపై సీబీఐ దర్యాప్తు జరిపించాలంటూ 2012లో విజయసాయి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషన్ కొట్టివేస్తూ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో వైఎస్ విజయమ్మ, పాల్వాయి గోవర్ధన్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లోనూ ఇవే విషయాలు ఉన్నాయని తెలిపింది. రెండు పిటిషన్లను హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టివేశాయని పేర్కొంది. అప్పటికే తేల్చిన అంశాలపై తిరిగి పిటిషన్ వేయడం రాజకీయ ప్రత్యర్థిని లక్ష్యంగా చేసుకోవడమేనని వ్యాఖ్యానించింది. ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన వ్యక్తుల పూర్వాపరాలను పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది.

# తూర్పు గోదావరిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఏడుగురు దుర్మరణం

**విశ్వంభర, దేవరపల్లి :** తూర్పు గోదావరి జిల్లా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏలూరు జిల్లా టీ నర్సాపురం మండలం బొర్రంపాలెం నుంచి జీడిపిక్కల లోడుతో తాడిపళ్ల గ్రామానికి వెళుతున్న మినీలారీ అదుపు తప్పి బోల్తా పడింది. మితిమీరిన వేగంతో ప్రయాణించడమే ప్రమాదానికి కారణమైంది. అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో లారీలో ఉన్న కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం బొర్రంపాలెం నుంచి తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తాడిమళ్లకు వెళుతున్నారు. ఆరిపాటి దిబ్బలుచిన్నాయి గూడెం రహదారిలోని దేవరపల్లి మండలం చిలకావారి పాకలు సమీపంలో వాహనం అదుపు తప్పి పంట బోదెలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. బొర్రంపాలెం మండలం నుంచి మంగళవారం రాత్రి జీడిపక్కల లోడుతో తాడిమళ్ళ గ్రామానికి చేరిన వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అరిటాకుదిబ్బలు చిన్నాయిగూడెం మధ్య వేగంగా ప్రయాణిస్తున్న లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న పంట కాల్వలోకి దూసుకు వెళ్లింది. ఈ ఘటనలో లారీ వెనుక జీడి పిక్కల లోడుపై కూర్చున్న కూలీలు బస్తాల కింద ఇరుక్కుపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. లారీ బోల్తా పడటాన్ని గుర్తించిన స్థానికులు హుటాహుటిన సహాయ చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో లారీలు ఎనిమిది మంది కూలీలు ఉన్నారు. కూలీల్లో ఒకరు క్యాబిన్లో ఉండగా మిగిలిన ఏడుగురు జీడి బస్తాలపై కూర్చున్నారు. ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇదే లారీలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు గాయాలతో బయట పడ్డారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఘంటా మధుగా గుర్తించారు. మృతులను తాడిమళ్లకు చెందిన దేవాబత్తుల బూరయ్య, తమ్మిరెడ్డి సత్యనారాయణ, పి.చినముసలయ్య, కత్తవ సత్తిపండు, తాడికృష్ణ, నిడదవోలు మండలం కాటకోటేశ్వరానికిచెందిన బొక్క ప్రసాద్ ఉన్నారు. ఘటనా స్థలాన్ని డిఎస్పీ పరిశీలించారు.గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందని వారిని



తాడిమళ్ల గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం

తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, చిలకావారిపాకలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లారీ బోల్తా కొట్టిన ఈ రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లారీలో ప్రయాణిస్తున్న కూలీలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందని సిఎం అన్నారు. గాయపడిన వారికి అందుతున్న వైద్యంపై సిఎం ఆరా తీశారు. మంచి వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. జీడిపిక్కల లోడ్ తో లారీ వెళుతుండగా అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం అన్నారు.

# వరద బాధితులకు విరాళాల వెల్లువ

- సీఎం సహాయనిధికి విద్యుత్ ఉద్యోగుల విరాళం
- రూ.10 కోట్లు విరాళంగా ఇచ్చిన ఉద్యోగులు

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో వరద బాధితులకు అండగా నిలిచేందుకు సామాన్యుల నుంచి సంస్థల వరకూ దాతలు ముందుకు వస్తున్నారు. తమకు చేతనైనంత సాయం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పలు ప్రభుత్వశాఖల ఉద్యోగులకు కూడా విరాళాలు అందిస్తున్నారు. తాజాగా ఏపీ విద్యుత్ ఇంజినీర్ల అసోసియేషన్, విద్యుత్ ఉద్యోగుల జేఏసీ సంయుక్తంగా రూ. 10 కోట్లు విరాళం ప్రకటించాయి. రెండూ కలిసి సంయుక్తంగా రూ.10,61,18,694 విరాళమిచ్చాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబును కలిసి విరాళం తాలూకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులను చంద్రబాబు అభినందించారు. మరోవైపు డిక్షన్ గ్రూప్ కోటి రూపాయలు, నెక్కంటి



సీ ఫుడ్స్ కోటి రూపాయలు చొప్పున విరాళాలు అందించాయి. ఈ మేరకు మంత్రి లోకేష్ను కలిసి విరాళం తాలూకు చెక్ అందించారు ఆయా సంస్థల ప్రతినిధులు. అలాగే సంధ్య ఆక్వా కోటి రూపాయలు విరాళంగా అందించింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రైస్ మిల్లర్ల అసోసియేషన్ రూ.25 లక్షలు, రేస్ పవర్ సంజయ్ గుప్తా రూ.25 లక్షలు చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన డాక్టర్ కేవి సుబ్బారెడ్డి రూ.11 లక్షలు సీఎం సహాయ నిధికి విరాళంగా అందించారు.

# విద్యార్థికి గుండెనొప్పి..

**సకాలంలో స్పందించిన సిబ్బందికి సజ్జనార్ అభినందన**



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** బస్సులో గుండె నొప్పితో బాధపడుతున్న ఓ విద్యార్థికి సకాలంలో వైద్య సాయం అందించి ఉదారత చాటుకున్న తమ సిబ్బందిని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. బుధవారం హైదరాబాద్లోని బస్ భవన్లో ఆదిలాబాద్ జిల్లా భైంసా డిపోకు చెందిన కండక్టర్ జి .గంగాధర్, బస్సు డ్రైవర్ బి.గంగాధర్లను టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఉన్నతాధికారులతో కలిసి సన్మానించి, నగదు బహుమతులు అందజేశారు. ఈ నెల 9న ఆదిలాబాద్ జిల్లా భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భైంసా నుంచి నిర్మల్కు వెళ్తోంది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు దిలావర్పూర్ వద్దకు రాగానే అందులో ప్రయాణిస్తున్న 12 ఏళ్ల విద్యార్థి కిరణ్కు ఒక్కసారిగా గుండె నొప్పి వచ్చింది. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ జి.గంగాధర్, డ్రైవర్కు చెప్పడంతో అప్రమత్తమైన గంగాధర్ బస్సును రోడ్డు పక్కకు నిలిపివేశాడు. వెంటనే విద్యార్థికి ప్రాథమిక చికిత్స అందించారు. ఆరోగ్యపరిస్థితి విషమించడంతో వెంటనే కిరణ్ను బస్సులోనే సమీపంలో ఉన్న నర్సాపూర్ పీహెచ్సీకి తరలించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో విద్యార్థికి ప్రాణాప్రాయం తప్పిందని అక్కడి వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి విద్యార్థి ప్రాణాలను కాపాడిన డ్రైవర్, కండక్టర్లను టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అభినందించారు. ఆపద సమయంలో ఆర్టీసీ సిబ్బంది సేవా భావం కలిగిఉండటం గొప్ప విషయమని కొనియాడారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు.. వారికి ఆపద సమయంలో మేము ఉన్నామని భరోసా కల్పిస్తుండటం అభినందనీయమని ప్రశంసించారు.

## చాక్లెట్ల తయారీ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

**విశ్వంభర, హైదరాబాద్:** పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి భాగ్యలక్ష్మి కాలనీలోని చాక్లెట్ల తయారీ కంపెనీలో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. చాక్లెట్ పౌడర్ ను వేడి చేసే క్రమంలో గ్యాస్ లీక్ అయింది. దీంతో దట్టమైన పొగలతో పాటు పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇళ్ల మధ్యలో ఉన్న కంపెనీలో మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ లోని వివిధ వినాయక మండపాల్లో విఘ్నేశ్వరుడికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరిపై ఆ విఘ్నేశ్వరుడి కృప కటాక్షాలు ఉండాలని ప్రార్థించానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్ కాంటెకర్ మధుమోహన్, స్థానిక కౌన్సిలర్లు జాపాల భావన సుధాకర్, రాజామోని రాజు ముదిరాజ్, బోధ యాదగిరి రెడ్డి, శ్రీనివాస్ నాయక్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణలోని కోచింగ్ సెంటర్లపై మంత్రివర్గ ఉపసంఘం కీలక నిర్ణయం

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో విద్యా వ్యవస్థపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. మంత్రులు శ్రీధర్బాబు, సీతక్క ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో తేవాల్సిన సంస్కరణలపై ఉపసంఘం చర్చించింది. కోచింగ్ సెంటర్ల నిర్వహణలో పాటించాల్సిన మార్గదర్శకాలపై కూడా చర్చ జరిగింది. కేంద్ర మార్గదర్శకాలు రాష్ట్రంలో అమలు కావట్లేదని కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు అమలు చేయాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని కోచింగ్ సెంటర్లలో కేంద్ర మార్గదర్శకాలను అమలు చేయాలని మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయించింది.

## బ్రిడ్జి ని పరిశీలించిన ఎమ్మెల్యే




**విశ్వంభర, ఆమనగల్లు:** అమనగల్లు మండలంలోని మేడిగడ్డ తాండ, శంకర్ కొండ తాండ గ్రామపంచాయతీల మధ్య నిర్మిస్తున్న కత్వా వాగు బ్రిడ్జి నిర్మాణ పనులను కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి బుధవారం మండలం పంచాయతీ రాజ్ ఏ.ఈ అభిషేక్ తో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా వెళ్ళటానికి రహదారిపై మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయ్, కె.ఎన్.ఆర్ యూవసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్, సేవదలం నాయకుడు బాబా, మల్లేష్ నాయక్, సిద్దు నాయక్, దేవేందర్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ ను కలిసిన ఎమ్మెల్యే కాలేరు

**అభివృద్ధి పనుల నిధులను మంజూరు చేయాలని వినతి**

**విశ్వంభర, హైదరాబాద్:** అంబర్ పేట నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్ లో అభివృద్ధి పనులకు సంబంధించిన రూ. 11 కోట్ల నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జోనల్ కమిషనర్ ను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్ ను కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ నిధులను తక్షణమే విడుదల చేసి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి నిధుల మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తానని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



### భారత ఫుట్బాల్ కోచ్ గా స్టిమాక్ ను పునరుద్ధరించడంపై

# స్వతంత్ర విచారణకు ఆదేశించాం




**విశ్వంభర (క్రీడా విభాగం):** భారత సీనియర్ ఫుట్బాల్ జట్టు ప్రధాన కోచ్ ఇగర్ స్టిమాక్ పై వేటు పడిన విషయం తెలిసిందే. జట్టు పేలవ ప్రదర్శన వల్ల ఇంకో రెండేళ్ల పదవీకాలం ఉండగానే అఖిల భారత ఫుట్బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అతడిని పదవి నుంచి తప్పించింది. 2019లో ప్రధాన కోచ్గా స్టిమాక్ నియమితులయ్యాడు. అతడి పదవీకాలాన్ని 2026కు పొడగిస్తూ గతేడాది అక్టోబర్లో నిర్ణయం తీసుకోగా.. ఈ ఏడాది జూన్ 17న అతడి ఒప్పందాన్ని రద్దు చేశారు. దీంతో మధ్యంతరంగా తప్పించినందుకు స్టిమాక్ భారత్ ఫుట్బాల్ సంఘంపై ఫిఫా వద్ద 9 లక్షల డాలర్ల (సుమారు రూ.7 కోట్లు) దావా వేశాడు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్లో జరిగిన ఏఐఎఫ్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఈ విషయంపై చర్చ జరిగింది. గతేడాది అతడి కాంట్రాక్ట్ పునరుద్ధరణపై స్వతంత్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది.

"మాజీ ప్రధాన కోచ్ స్టిమాక్ ఫిఫా ట్రిబ్యునల్కి సుమారు రూ.7 కోట్ల దావా వేశాడు. ఈ విషయంపై అంతర్గత విషయాల పరిశీలనకు స్వతంత్ర విచారణ చేపడతారు. 2023లో అతడికి అనుకూల నిబంధనలతో కూడిన కాంట్రాక్ట్ ని ఆమోదించారు. ఇప్పుడదే ఐఏఎఫ్ఎఫ్ ని రాజీ స్థితికి తీసుకొచ్చింది. అదే భారీగా ఆర్థిక నష్టానికి దారితీసింది. స్టిమాక్ ఇప్పుడు భారత ఫుట్బాల్లో ఎలాంటి పదవులను పొందడానికి అవకాశం లేదు. అయితే ఆసియా ఫుట్బాల్ సమాఖ్యలోని వివిధ కమిటీల్లో ఎలా ప్రాతినిధ్యం వహిస్తున్నారనే దానిపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులను మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు" అని ఏఐఎఫ్ఎఫ్ తెలిపింది. నష్టపరిహారంగా 4 లక్షల డాలర్లు (3.8కోట్లు) వరకు ఇచ్చేందుకు ఐఏఎఫ్ఎఫ్ అంగీకరించినా.. స్టిమాక్ మాత్రం రూ. 7 కోట్ల వరకు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టినట్లు క్రీడా వర్గాలు వెల్లడించాయి.

### ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ లో

# టాప్-5లోకి రోహిత్ శర్మ!




**విశ్వంభర (క్రీడా విభాగం):** ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టాప్-5లో చోటు దక్కించుకున్నాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బుధవారం టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల చేసింది. సెప్టెంబర్ 2021 తర్వాత తొలిసారి రోహిత్ టాప్-5లోకి చేరుకున్నాడు. టీమిండియా సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్ ర్యాంకులు సైతం మెరుగయ్యాయి. జైస్వాల్ ఆరు, విరాట్ ఏడో ప్లేస్లో నిలిచారు. టీమిండియా త్వరలో బంగ్లాదేశ్లో టెస్ట్ సిరీస్ ఆడనున్నది. ఈ సిరీస్లో ఆటగాళ్లు రాణిస్తే ర్యాంకులు మరింత మెరుగయ్యే ఛాన్స్ ఉన్నది. ఈ ఏడాది ఇంగ్లండ్తో భారత్ ఐదు మ్యాచ్ల టెస్టు సిరీస్ ఆడింది. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ బ్యాట్తో రాణించారు. ఇద్దరు అద్భుతమైన ఫామ్లో ఉన్నారు. యువ బ్యాటర్ జైస్వాల్ ఈ సిరీస్లో రెండు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలు చేసి.. మొత్తం 712 పరుగులు చేశాడు. రోహిత్ శర్మ సైతం రెండు సెంచరీలతో రాణించి 400 పరుగులు చేశాడు. ఈ సిరీస్కు విరాట్ కోహ్లీ దూరమైన విషయం తెలిసిందే. తాజాగా ఐసీసీ ప్రకటించిన టెస్టు ర్యాంకింగ్స్లోనూ శ్రీలంక బ్యాటర్లు మెరుగైన ర్యాంకులకు చేరారు. ఇంగ్లండ్తో జరిగిన సిరీస్లో ఓలీ పోప్ నేతృత్వంలోని జట్టును ఓడించిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ టెస్ట్ ర్యాంకింగ్స్లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, శ్రీలంకతో జరిగిన మూడో, చివరి టెస్ట్లో రెండుసార్లు విఫలం కావడంతో రేటింగ్ తగ్గింది. స్కోర్ 922 పాయింట్ల నుంచి 899 పాయింట్లకు పడిపోయింది. న్యూజిలాండ్ సీనియర్ ఆటగాడు కేన్ విలియమ్సన్ 859 రేటింగ్ పాయింట్లతో రెండోస్థానంలో కొనసాగుతున్నాడు. మూడోస్థానంలో న్యూజిలాండ్ క్రికెటర్ డారిల్ మిచెల్, నాలుగో స్థానంలో ఆస్ట్రేలియా ఆటగాడు స్టీవ్ స్మిత్ కొనసాగుతున్నారు. టాప్ 10లో పాక్ వికెట్ కీపర్, బ్యాట్స్మన్ మహ్మద్ రిజ్వాన్ తొమ్మిదో స్థానంలో నిలిచాడు.

# ఓ ఫోటో తీసి రాజకీయం చేశారు..

## పీటీ ఉషపై వినేశ్ ఫోగట్ ఫైర్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్లో రెజ్లర్ వినేశ్ ఫోగట్.. 53 కిలోల ఫ్రీ స్టయిల్ రెజ్లింగ్ ఫైనల్ రోజున అధిక బరువుతో అనర్హత వేటుకు గురైన విషయం తెలిసిందే. ఆ రోజున నీరసించిన వినేశ్కు ఒలింపిక్స్ విలేజ్లోని క్లినిక్లో చికిత్స చేశారు. ఆ సమయంలో భారత ఒలింపిక్ సంఘ అధ్యక్షురాలు పీటీ ఉష.. ఆ రెజ్లర్ను పరామర్శించారు. అయితే ఆ ఇద్దరి భేటీకి చెందిన ఓ ఫోటోను కూడా రిలీజ్ చేశారు. ఆ ఫోటోపై ఇప్పుడు రెజ్లర్ వినేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ ఫోటో క్లిక్ చేసి, ఆ అంశాన్ని రాజకీయం చేసినట్లు రెజ్లర్ ఆరోపించారు. పీటీ ఉష వ్యవహరించిన తీరును వినేశ్ తప్పుపట్టారు. తనకు తెలియకుండా ఫోటో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారని పీటీ ఉషపై వినేశ్ ఫోగట్ ఆరోపణలు చేశారు.పీటీ ఉష నుంచి తనకు ఎటువంటి మద్దతు లభించలేదని రెజ్లర్ వినేశ్ తెలిపారు. తనకు ఎటువంటి మద్దతు లభించిందో తనకు తెలియదన్నారు. ఓ స్థానిక న్యూస్ ఛానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆమె మాట్లాడుతూ.. పీటీ ఉష మేడం హాస్పిటల్ను తనను కలిశారని, ఓ ఫోటో తీశారని, మీరు చెప్పినట్లే, రాజకీయాల్లో తెరవెనుక చాలా జరుగుతుందన్నారు. అలాగే పారిస్లోనూ రాజకీయం జరిగిందన్నారు. అందుకే తన గుండె పగిలిందని, రెజ్లింగ్ వీడవద్దు అని చాలా మంది వేడుకున్నారని, ఎక్కడకు వెళ్లిన రాజకీయం ఉందని వినేశ్ తెలిపారు.సోషల్ మీడియాలో ఫోటోను షేర్ చేసిన పీటీ ఉష వైఖరి సరిగా లేదని వినేశ్ ఆరోపించారు. మద్దతు ప్రకటించేందుకు అది సరైన విధానం కాదన్నారు. అది మద్దతు కాదు నటన అన్నట్లు వినేశ్ పేర్కొన్నారు.

### ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో

# కొనసాగుతున్న భారత్ జైత్రయాత్ర

### మలేసియాని చిత్తు చేసిన భారత్ హాకీజట్టు




**విశ్వంభర (క్రీడా విభాగం):** చైనాలో జరుగుతున్న ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు వరుస విజయాలను నమోదు చేస్తోంది. తొలి మ్యాచ్లో చైనాని 3-0తో మట్టి కరిపించి.. ఆ తర్వాత జపాన్ని 5-1తో చిత్తు చేసిన భారత్.. ప్రస్తుతం మలేసియాని 8-1 తేడాతో ఓడగొట్టి మూడో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. భారత్ తరపున రాజ్కుమార్ పాల్ (3వ, 25వ, 33వ నిమిషం), అరైజీత్ సింగ్ హుందాయ్ (6వ, 39 నిమిషం), పెనాల్టీ కార్నర్ ద్వారా జుగ్రాజ్ సింగ్ (7వ నిమిషం), హర్మన్ ప్రీత్ సింగ్ (22వ నిమిషం), ఉత్తమ్ సింగ్ (40వ నిమిషం) గోల్స్ చేశారు. మలేసియా తరపున అనౌల్ అభిముల్లా (34వ నిమిషం) గోల్ చేశాడు. అయితే.. ఈ మ్యాచ్ తొలి మూడు క్వార్టర్లో రాజ్ కుమార్ హ్యాట్రిక్ కొట్టగా, మొదటి, మూడో క్వార్టర్లో హుందాయ్ బంతిని గోల్ పోస్ట్లోకి పంపాడు. పెనాల్టీ కార్నర్ నుంచి హర్మన్ ప్రీత్ సింగ్, జుగ్రాజ్ సింగ్ స్కోర్లోట్లోకి ప్రవేశించగా.. ఉత్తమ్ ఎనిమిది, చివరి గోల్ను సాధించాడు. దీంతో మలేసియా మూడు మ్యాచ్లు ఆడగా రెండు మ్యాచ్లు ఓడి.. మరోటి డ్రా చేసుకుంది. ఇదిలా ఉండగా.. సెప్టెంబర్ 12న భారత్ దక్షిణ కొరియాతో తలపడనుంది.

### బుమ్రాతో జాగ్రత్త.. జో రూట్ను

# హెచ్చరించిన మైకేల్ వాన్




**విశ్వంభర (క్రీడా విభాగం):** ఇటీవల కాలంలో ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ వరుస శతకాలతో దూసుకుపోతున్నాడు. అతను ఇదే దూకుడును కొనసాగిస్తే టెస్టుల్లో సచిన్ అత్యధిక పరుగుల రికార్డును బద్దలు కొట్టే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ ఇరు దేశాల మధ్య జరగనున్న ఐదు టెస్టుల గురించి మాట్లాడాడు. ఎంత ఫామ్లో ఉన్నప్పటికీ భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన బౌలింగ్ మార్క్తో రూట్ని ఇబ్బంది పెడతాడని అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో జరిగిన మూడో టెస్ట్లో రూట్ రెండు ఇన్నింగ్స్ (13, 12 పరుగులు) పేలవ ప్రదర్శన చేశాడు. ఈ మ్యాచ్ లో మిగతా బ్యాటర్లు రాణించినా ఇంగ్లండ్ ఎనిమిది వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఆ విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్కు రూట్ చాలా ముఖ్యమని మైకేల్ వాన్ పేర్కొన్నాడు. 'ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్కి జో రూట్ ఎంతో ముఖ్యం. అతను రాణించడం ఎంతో కీలకం. మిగతా బ్యాటర్లు అర్ధ శతకాలు చేసినప్పటికీ నాలుగో స్థానంలో వచ్చి రూట్ చేసే భారీ పరుగులే జట్టుకి కీలకం. జో రూట్కి బౌలింగ్ చేయడానికి బుమ్రా ఇష్టపడతాడు. రాబోయే సిరీస్లో అతడు రూట్ని మరింత ఇబ్బంది పెట్టొచ్చు. ఆస్ట్రేలియా ఆటగాడు పాట్ కమిన్స్ విషయంలో కూడా ఇదే జరుగుతుంది. అక్కడ రూట్ ఇప్పటి వరకూ సెంచరీ చేయలేదు. అయితే రూట్ భారీ స్కోర్లు చేయనప్పుడు ఇంగ్లండ్ విజయం సాధించే మార్గాలు ఉండాలి. కానీ, వారు అలా చేయట్లేదు" అని మైకేల్ వాన్ వివరించాడు. రూట్కు తన టెస్ట్ కెరీర్లో భారత్పై అత్యధిక పరుగులు చేసి రికార్డు సృష్టించాడు. భారత్పై 10 శతకాలు, 11 అర్ధ శతకాలు సహా 2846 పరుగులు సాధించాడు.

### 2023 వన్డే ప్రపంచకప్ ద్వారా భారత్ కు

# రూ.11,637 కోట్ల ఆదాయం!




**విశ్వంభర (క్రీడా విభాగం):** గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్ 2023 నకు భారత్ ఆతిథ్యమిచ్చిన విషయం తెలిసిందే. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ మెగా టోర్నీలో మ్యాచ్లను ప్రత్యక్షంగా వీక్షించడానికి అనేక దేశాల అభిమానుల భారత్ కు పోటెత్తారు. ఈ టోర్నీలో వరుస విజయాలతో ఫైనల్కు చేరిన టీమ్ ఇండియా .. చివరి మెట్టుపై బోల్తాపడి రన్నరప్తో సరిపెట్టుకుంది. ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. వన్డే ప్రపంచకప్ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు 11,637 కోట్ల ఆదాయం సమకూరిందని ఐసీసీ వెల్లడించింది. మ్యాచ్లకు ఆతిథ్యం ఇచ్చిన నగరాల్లో టూరిజం, వసతి, ప్రయాణం, రవాణా, ఆహారం, పానీయాల అమ్మకాల ద్వారా 861.4 మిలియన్ డాలర్ల ఆదాయం వచ్చినట్లు తెలిపింది. ప్రపంచకప్ వల్ల ఆతిథ్య రంగంలో ప్రత్యక్షంగా సుమారు 48,000 కంటే ఎక్కువమంది పార్ట్ టైమ్, ఫుల్ టైమ్ ఉద్యోగావకాశాలు పొందారని ఐసీసీ పేర్కొంది.




## శాంసంగ్లో లేఆఫ్స్ కలకలం..

# 200 మందిని ఉద్యోగులపై వేటు

**విశ్వంభర (బిజినెస్):** శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ భారత్ ఆపరేషన్స్కు చెందిన 200 మందికి పైగా ఉద్యోగులను విధుల నుంచి తొలగించనుంది. వ్యాపార వృద్ధి మందగించడం, వ్యయ నియంత్రణ, డిమాండ్ లేమి వంటి కారణాలతో ఉద్యోగులను కుదించాలని కంపెనీ నిర్ణయించిందని సమాచారం. మొబైల్ ఫోన్లు, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, సపోర్ట్ ఆపరేషన్స్ వంటి పలు విభాగాల్లో లేఆఫ్స్ ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. భారత్లో శాంసంగ్ ఎగ్జిక్యూటివ్లు దాదాపు 2000 మంది ఉండగా వీరిలో 9 నుంచి 10 శాతం ఉద్యోగులపై తాజా లేఆఫ్స్ ప్రభావం ఉంటుంది. కంపెనీ చెన్నై ఫ్యాక్టరీలో కార్మికులు సమ్మెలో ఉన్న సమయంలో లేఆఫ్స్ వార్తలు ఉద్యోగుల్లో గుబులు రేపుతున్నాయి. సమ్మె కారణంగా టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్ల ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. సమ్మె మూడో రోజుకు చేరుకోగా ఫ్యాక్టరీ సామర్థ్యంలో 50 శాతం నుంచి 80 శాతం వరకే ఉత్పత్తి జరుగుతోంది. పండగ సీజన్లో అటు లేఆఫ్స్, ఇటు కార్మికుల సమ్మె కంపెనీపై ఒత్తిడి పెంచుతోంది. మరోవైపు లేఆఫ్స్తో పాటు భారత్లో తమ కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణపైనా శాంసంగ్ దృష్టిసారించింది. ఇందులో భాగంగా టీవీ, హోం అప్లయన్సెస్ వంటి పలు వ్యాపార విభాగాల విలీనంతో మరికొన్ని ఉద్యోగాలను కుదించే అవకాశం ఉంది. ఇక దివాలీ సీజన్ అనంతరం దీనిపై తుది నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు.

### ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కు

# రూ.కోటి జరిమానా




**విశ్వంభర (బిజినెస్) :** ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్డీఏఐ) దేశంలోని అన్ని పబ్లిక్, ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను మానిటర్ చేస్తుంది. ఆయా ఇన్సూరెన్స్ కంపెనీలు నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటుంది. తాజాగా ఈ సంస్థ ఎస్బీఐ అనుబంధ 'ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్' కంపెనీకి షాకిచ్చింది. ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కొన్ని నియమాలు ఉల్లంఘించినట్లు తేలడంతో ఐఆర్డీఏఐ భారీ జరిమానా విధించింది. పాలసీబజార్, ఎంఐసీ ఇన్సూరెన్స్, కంపేర్ పాలసీ, ఈజీ పాలసీ, విష్ఫిన్ వంటి ఇన్సూరెన్స్ వెబ్ అగ్రిగేటర్లతో కంపెనీ పని చేస్తున్న విధానంలో అనేక సమస్యలను ఐఆర్డీఏఐ గుర్తించింది. ఇన్సూరెన్స్ వెబ్ అగ్రిగేటర్స్, అవుట్సోర్సింగ్ పద్ధతుల్లో ఉల్లంఘనలకు పాల్పడినందుకు రూ.1 కోటి పెనాల్టీ విధించింది. ఎస్బీఐ లైఫ్ వెబ్ అగ్రిగేటర్లు అందించే సేవలను స్పష్టంగా పేర్కొనలేదు. వారికి ఎంత చెల్లించిందో వెల్లడించలేదు. కంపెనీ 2018, 2019 ఆర్థిక సంవత్సరాల్లో ఎక్స్టెంట్ మార్కెటింగ్ అండ్ టెక్నాలజీస్ అనే విక్రేతకు రూ.1.93 కోట్ల విలువైన చెల్లింపులు చేసింది. అయితే చట్ట ప్రకారం ఈ చెల్లింపులను ఐఆర్డీఏఐకి రిపోర్ట్ చేయలేదు. విస్తారమైన మార్కెటింగ్ బాధ్యతలను నిర్వహించడానికి తగినంత మౌలిక సదుపాయాలను కలిగి లేదు. థర్డ్ పార్టీలపై ఎక్కువగా ఆధారపడింది. వాస్తవానికి రెవెన్యూలో 95% ఇతర కంపెనీలకు బదిలీ అయింది. ఎస్బీఐ లైఫ్ తన ఔట్సోర్సింగ్ పార్ట్నర్స్తో చేసుకున్న ఒప్పందాల్లో పారదర్శకత లేదని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ గుర్తించింది. వెబ్ అగ్రిగేటర్లకు ఎస్బీఐ లైఫ్ చాలా ఎక్కువ ఫీజులు చెల్లించినట్లు కూడా ఐఆర్డీఏఐ తేల్చింది. ఇకపై ఐఆర్డీఏఐనిబంధనలను అనుసరించే కొత్త, సమగ్రమైన అవుట్సోర్సింగ్ విధానాన్ని అభివృద్ధి చేయాలని ఎస్బీఐ లైఫ్ను ఆదేశించింది. కంపెనీ తప్పనిసరిగా ఐఆర్డీఏఐ కనుగొన్న లోపాలను డైరెక్టర్ల బోర్డుకు సమర్పించాలని సూచించింది. ఎస్బీఐ లైఫ్ డెత్ క్లెయిమ్లను ఎలా హ్యాండిల్ చేసిందనే విషయంలో కూడా ఐఆర్డీఏఐ సమస్యలను గుర్తించింది. నిర్దిష్టంగా కంపెనీ 21 క్లెయిమ్లను తిరస్కరించింది. సమాచారాన్ని బహిర్గతం చేయకపోవడం లేదా పాలసీ జారీ చేసిన మూడు సంవత్సరాలలోపు మరణం సంభవించడం కారణాలుగా చూపింది. అయితే ఈ పాలసీ రిజెక్షన్లను సమర్థించేందుకు తగిన ఆధారాలను ఎస్బీఐ లైఫ్ అందించలేదని ఐఆర్డీఏఐ నిర్ధారించింది. రెగ్యులేటర్.. ఎస్బీఐ లైఫ్కు ఇన్సూరెన్స్ యాక్ట్ 1938లోని సెక్షన్ 45కి కట్టుబడి ఉండాల్సిన ప్రాముఖ్యతను గుర్తుచేసింది. ఈ సెక్షన్ మూడు సంవత్సరాల పాటు లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ అమల్లో ఉన్న తర్వాత, దాన్ని కంపెనీ సవాలు చేయలేదు లేదా కంటెస్ట్ చేయలేదు. ఈ మూడేళ్ల వ్యవధి పాలసీ జారీ అయిన తేదీ నుంచి ప్రారంభమవుతుంది. విచారణ సమయంలో ఎస్బీఐ లైఫ్ 86 క్లెయిమ్లను పరిష్కరించింది. మొత్తం రూ.10.21 కోట్లు చెల్లించింది. ఇందులో రూ.5.78 కోట్లు సెటిల్మెంట్లు, రూ.4.43 కోట్లు జరిమానా వడ్డీ ఉన్నాయి.



# సరికొత్తగా ఈవీ కారుని లాంచ్ చేసిన ఎంజీ మోటార్స్

### రూ.9.99 లక్షల ధరతోనే మార్కెట్లోకి విడుదల

**విశ్వంభర (బిజినెస్):** బ్రిటిష్కు చెందిన ప్రముఖ కార్ల కంపెనీ ఎంజీ మోటార్స్ భారత మార్కెట్లోకి మరో ఈవీ కార్ను బుధవారం లాంచ్ చేసింది. ఈ ఈవీ కార్ రూ.9.99లక్షల ప్రారంభ ధరతో కంపెనీ విడుదల చేసింది. ఇది ఎక్స్షోరూం ధరమాత్రమే. జెడ్ఎస్ ఈవీ, కామెట్ ఈవీ తర్వాత మూడో ఎలక్ట్రిక్ కారు విండ్సోర్ కావడం విశేషం. కొత్తగా బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ (బాస్) ప్రోగ్రామ్ని సైతం ఎంజీ ప్రారంభించింది. ఇందులో కిలోమీటర్కు రూ.3.5 చొప్పున చెల్లించి బ్యాటరీని తీసుకునేందుకు ఛాన్స్ ఉంటుంది. ఇక కారు అడ్వాన్స్ బుకింగ్ అక్టోబర్ 3న మొదలై.. 12 నుంచి డెలివరీ చేయనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఎంజీలో జేఎస్డబ్ల్యూ సంస్థ వాటాలు కొనుగోలు చేసిన అనంతరం విడుదల చేసిన తొలి ఈవీ ఇదే. జెడ్ఎస్ ఈవీ, కామెట్ ఈవీలకు భిన్నంగా మిడ్సైజ్ క్రాసోవర్ డిజైన్లో కంపెనీ రూపొందించింది. అత్యాధునిక ఫీచర్స్తో పాటు ప్రయాణికులకు విశాలమైన స్పేస్ని ఆఫర్ చేసినట్లు కంపెనీ చెప్పింది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న ఈవీ కార్లతో పోలిస్తే విండ్సోర్ డిజైన్ భిన్నంగా ఉంటుంది. లుక్స్లో ఉలుంగ్ క్లౌడ్ ఈవీ తరహాలో రూపొందించగా.. భారత్లో అవసరమైన పలు మార్పులు చేసి ప్రత్యేకంగా గుర్తింపును తెచ్చే ప్రయత్నం చేసింది. ఈ కారు చైనా వులింగ్ క్లౌడ్ ఈవీ రీ బ్రాండెడ్ వెర్షన్. ఇది ఎంపిక చేసిన గ్లోబల్ మార్కెట్లలో అందుబాటులో ఉన్నది. ఇక ఎండీ విండ్సోర్ ఈవీ 134 బీహెచ్పీ, 200 ఎన్ఎం టార్క్ను ఉత్పత్తి చేసే ఎలక్ట్రిక్ మోటార్ ఉంటుంది. మోటార్ ప్రిస్మాటిక్ సెల్స్తో 38 కేడబ్ల్యూహెచ్ ఎల్ఎఫ్పీ బ్యాటరీ పాక్ ద్వారా శక్తి అందుతుంది. ఒక్కసారి ఛార్జ్ చేసే 331 కిలోమీటర్లు దూసుకెళ్తుంది. ఈవీ 4,295 మిల్లీమీటర్ల పొడవు, 1,652 మిల్లీమీటర్ల ఎత్తు, 1,850 మిల్లీమీటర్ల వెడల్పు ఉంటుంది. వీల్బేస్ 2,700 మిల్లీమీటర్లు. దాంతో వెనుకవైపు సౌకర్యవంతంగా ఉంటాయి. 18 అంగుళాల డైమండ్ కట్ అలాయ్ వీల్స్, ఎల్ఈడీ డీఆర్ఎల్స్, ఫ్రంట్ ఛార్జింగ్ ఇన్లెట్ లైట్స్, వెనుక భాగంలో ఎల్ఈడీ టెయిల్ లైట్ యూనిట్స్తో వస్తుంది. దీనికి ఫ్లష్ ఫిట్టింగ్ డోర్ హ్యాండిల్స్ ఉన్నాయి. కారులో ముందుభాగంలోని సీట్లు విమానాల్లో ఫస్ట్క్లాస్ సెక్షన్ తరహాలో 135 డిగ్రీల్లో వాల్చుకునే అవకాశం ఉంది. వాహనంలో అన్ని సీట్లలో భారీగా కుషన్ని వాడారు. ఇక పనోరమిక్ సన్రూఫ్, ఎయిర్ ప్యూరిఫికేషన్ సిస్టమ్, యాంబియంట్ లైటింగ్ ప్రధాన ఆకర్షణగా నిలువనున్నాయి. 8.8 అంగుళాల డ్రైవర్ డిస్ప్లే, 15.6 అంగుళాల మేయిన్ ఇన్ఫోటెయిన్మెంట్ స్క్రీన్ ఈవీకి లగ్జరీ లుక్ను తెచ్చిపెట్టాయి. ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ప్లేని సపోర్ట్ చేయనున్నాయి. లెవెల్ 2 ఏడీఏఎస్, 360 డిగ్రీస్ కెమెరా, 9 స్పీకర్ సౌండ్ సిస్టమ్, పీఎం 2.5 ఎయిర్ ఫిల్టర్, ఆరు ఎయిర్బ్యాగ్లు, ఈఎస్సీ మరెన్నో ఫీచర్లు సైతం ఉన్నాయి. ఈ కారులో 600 లీటర్ల భారీ బూట్ స్పేస్ను ఉంటుంది. ఈ కారు టాటా ఈవీ కర్వ్, టాటా నెక్సాన్ ఈవీ మాక్స్, మహీంద్రా ఎక్స్యూవీతో పోటీ పడనున్నది.

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### 399 పాయింట్లు పతనమైన సెన్సెక్స్..!



**విశ్వంభర, బిజినెస్:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల పవనాలు దేశీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపించాయి. దాంతో మార్కెట్లు పొద్దంతా నష్టాల్లోనే కొనసాగాయి. క్రితం సెషన్తో పోలిస్తే సెన్సెక్స్ 81,928.12 పాయింట్ల వద్ద ఫ్లాట్గా మొదైలంది. ఆ తర్వాత మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. ట్రేడింగ్లో 81,423.14 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 82,134.95 పాయింట్లను తాకింది. చివరకు 398.13 పాయింట్లు పతనమై.. 81,523.16 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 122.65 పాయింట్లు పతనమై.. 24,918.45 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్లో 1,619 స్టాక్స్ లాభాల్లో కొనసాగగా.. 2,345 షేర్లు పతనమయ్యాయి. బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పేయింట్స్, బ్రిటానియా, శ్రీరామ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, ఎస్బీఐ లైఫ్ ఇన్సురెన్స్, దివిస్ ల్యాబ్ టాప్ గెయినర్స్గా నిలిచాయి. ఇక టాటామోటార్స్, ఓఎన్జీసీ, విప్రో, ఎస్బీఐ, హిందాల్కో, ఎన్టీపీసీ, బీపీసీఎల్, లార్సెన్, అదానీ పోర్ట్స్, కోల్ ఇండియా, ఎంఅండ్ఎం నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీలో ఆయిల్, గ్యాస్ ఇండెక్స్ భారీగా నష్టపోయాయి. ఏకంగా రెండుశాతం తగ్గింది. పీఎస్యూ బ్యాంక్, మెటల్ 1.5శాతానికిపైగా పతనమయ్యాయి. ఆటో, రియల్టీ సైతం 1.2శాతం వరకు తగ్గాయి. ఎఫ్ఎంసీజీ 0.3శాతం పెరిగి టాప్ గెయినర్గా నిలిచింది. యూఎస్ ద్రవ్యోల్బణం గణాంకాలు విడుదల కాకముందే మార్కెట్లు పతనమయ్యాయి. ఈ కాలంలో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.47 లక్షల కోట్లు తగ్గి రూ.461.02 లక్షల కోట్లకు చేరుకుంది. బలహీనమైన ఆర్థిక పరిస్థితులు, హై వాల్యుయేషన్ కారణంగా వచ్చే 12 నెలల్లో భారత వాహన తయారీదారుల షేర్లు 21 శాతం పతనమయ్యే అవకాశం ఉందని యూబీఎస్ అంచనా వేసింది. గ్లోబల్ డిమాండ్ మందగించడంపై పెరుగుతున్న ఆందోళనలపై మంగళవారం ట్రేడింగ్ సెషన్లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ డిసెంబర్ 2021 నుంచి కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దాంతో చమురు, గ్యాస్ ఇండెక్స్ 1.9శాతం పతనమైంది.



# 100 కోట్ల హర్రర్ మూవీలో పూజా హెగ్డే

విశ్వంభర, సినిమా : టాలీవుడ్‌లో నాలుగేళ్ల క్రితం వరకు వరుస అవకాశాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన పూజా హెగ్డేకు ప్రస్తుతం ఛాన్స్‌లు ఏమీ లేవు. ఆ మధ్య తెలుగు, తమిళంలో వరుసగా ఫ్లాప్‌లు రావడంతో బాలీవుడ్‌పై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే సల్మాన్ ఖాన్‌తో కలిసి కిసీకా భాయ్ కిసీకా జాన్ చేయగా అది కాస్త బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. దీంతో ప్రస్తుతం ఆమె చేతిలో కేవలం రెండు సినిమాలు మాత్రమే ఉన్నాయి. ముని సిరీస్‌తో ప్రేక్షకులను మెప్పించిన రాఘవ లారెన్స్, సూపర్ హిట్ కాంచన సిరీస్‌ను మరోసారి తెరపైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. చాలా కాలంగా హీరోగా నటిస్తూ బిజీగా ఉన్న లారెన్స్, ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో కాంచన్ 4 చిత్రానికి సంబంధించిన కథ పూర్తయిందని తెలిపారు. ఈ సినిమా కూడా గత సినిమాల మాదిరిగానే ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈ హార్రర్ మూవీ దాదాపు రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. బాలీవుడ్‌కు చెందిన గోల్డ్ మైన్ మూవీస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని చిత్ర బృందం వెల్లడించింది. అయితే ఈ దెయ్యాల సినిమాలపై హాట్ బ్యూటీస్ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. ఇప్పటికే రాశిఖన్నా, తమన్నా, హన్సిక, త్రిష వంటి స్టార్ హీరోయిన్స్ ఈ జోనర్ లో నటించి హిట్లు కొట్టిన విషయం తెలిసిందే. వారి అడుగు జాడల్లోనే పూజా హెగ్డే అడుగులు వేయబోతోంది. ఈ క్రేజీ హార్రర్ మూవీకి బుట్టబొమ్మ అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వబోతుందని టాక్. అయితే దెయ్యం పాత్రలో బ్యూటీ భయపెట్టబోతుందో చూడాలి.

## సల్మాన్ 'సికిందర్'లో కాజల్ అగర్వాల్



**విశ్వంభర, సినిమా :** బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. సికిందర్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తెలిసిందే. తాజాగా ఈ మూవీలో మరో భామ కూడా చేరిపోయింది. ఇంతకీ ఎవరా బ్యూటీ అనుకుంటున్నారా..? టాలీవుడ్ కలువ కండ్ల సుందరి కాజల్ అగర్వాల్ మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నట్టు వచ్చిన వార్తలు నిజమయ్యాయి. సికిందర్ టీంలోకి కాజల్‌కు స్వాగతం పలుకుతూ.. సెట్స్‌లో జాయిన్ అయిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. మరి మురుగదాస్ ఈ ఇద్దరు భామలను ఎలాంటి పాత్రల్లో చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో సికిందర్ ఉండబోతుందని బీటౌన్ సర్కిల్ సమాచారం.

## నటి మలైకా అరోరా తండ్రి ఆత్మహత్య



**విశ్వంభర, సినిమా:** బాలీవుడ్ స్టార్ నటి మలైకా అరోరా తండ్రి అనిల్ అరోరా కొద్దిసేపటి క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. ముంబైలోని తన నివాసం టెర్రస్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే బాంద్రా పోలీసులు, క్రైం బ్రాంచ్ బృందం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనా ప్రదేశంలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని పోలీసులు తెలిపారు. అయితే, గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిసింది. ఘటన జరిగిన సమయంలో మలైకా అరోరా ఇంట్లో లేరు. ప్రస్తుతం పూణెలో ఉన్న ఆమె సమాచారం అందుకున్న వెంటనే ముంబైకి బయలుదేరారు. అనిల్ అరోరా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## హీరో జీవాకు తప్పిన పెను ప్రమాదం

**విశ్వంభర, సినిమా:** తమిళ హీరో జీవా తన భార్యతో కలిసి చెన్నై నుంచి చిన్నసేలం వైపు కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కళ్లకురిచి జిల్లా కన్నియమూర్ వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. అడ్డుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయే క్రమంలో ఆయన కారు బారికేడ్‌ను ఢీ కొట్టినట్లు తమిళ మీడియా పేర్కొంది. అదృష్టవశాత్తూ జీవా, ఆయన భార్య ఇద్దరూ ఈ ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు.

## జయం రవి విడాకుల ప్రకటనపై మాజీ భార్య ఆర్తి షాకింగ్ కామెంట్స్

**విశ్వంభర, సినిమా :**



భార్య నుంచి విడాకులు తీసుకున్నట్టు నటుడు జయం రవి ప్రకటించిన రెండ్రోజుల తర్వాత ఆర్తి స్పందించారు. నేడు ఆమె ఓ స్టేట్‌మెంట్ విడుదల చేస్తూ.. రవి తనకు తెలియకుండానే ఈ ప్రకటన చేసినట్టు ఆమె పేర్కొన్నారు. అది చూసి తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. తనకు తెలియకుండా, తన అనుమతి లేకుండానే విడాకులపై ఆయన ప్రకటన చేశారని ఆరతి పేర్కొన్నారు. విషయం తెలిసి ఎంతో బాధపడ్డానని, తాము 18 ఏళ్లు కలిసి ఉన్నామని తెలిపారు. ఇలాంటి ముఖ్యమైన విషయాన్ని తనకు తెలియకుండా ప్రకటించడం ఎంతో బాధించిందన్నారు. తమ మధ్య నెలకొన్న మనస్పర్థలను, విభేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నించానని, భర్తతో నేరుగా మాట్లాడే చాన్స్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నానని చెప్పారు. అయితే, దురదృష్టవశాత్తు తనకు ఆ అవకాశం దక్కలేదన్నారు. జయం రవి ప్రకటన చూసి తాను, పిల్లలు షాకయ్యామని, ఇది పూర్తిగా ఏకపక్ష నిర్ణయమని ఆర్తి పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల తమకు ఏమాత్రం మంచి జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ కలిగినా తాను గౌరవంగానే ఉండాలని అనుకుంటున్నానని, అందుకే బహిరంగంగా ఎలాంటి ప్రకటన చేయలేదని వివరించారు. అన్యాయంగా తనపై వేస్తున్న నిందలను భరించడం కష్టంగా ఉందని, తనను తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆర్తి వాపోయారు. ఒక తల్లిగా తన తొలి ప్రాధాన్యం ఎప్పుడూ పిల్లల శ్రేయస్సేనని, ఈ వార్త వారిపై ప్రభావాన్ని చూపుతుందని పేర్కొన్నారు. అయితే, కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందన్నారు. తమకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకొంటున్నానని, తమ గోప్యతకు భంగం కలిగించద్దని ఆర్తి విజ్ఞప్తి చేశారు.










Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com